పెద్ద కథ :

# చీకటి తప్పు

(క)

కర్మభూమియందలి కన్యకామణులందఱకువలెనే చూడమ్మకును ఎనిమిదవ యేఁటనే తాళిపడెను. చాలమంది కన్యకామణులకువలెనే తొమ్మిదవయేఁట తెగెను. 'ఇదిగోఁ బసుపు, అదిగో ముసుఁగు!'

చూడమ్మకు తల్లిదండ్రులుచేసిన పెండ్లి గుఱుతులేదు. కాని తానును సుబ్బారావును చేసికొనిన పెండ్లి నేఁటికిని గుఱుతు. మగనిచావు గుఱుతులేదుకాని ఆ దినములలో వియ్యాలవారును, తనతల్లియు చేసినయుద్ధము హృత్కవిలె. విశేషించి నాఁడు తనతల్లి మాణిక్యము చేసిన ముద్దు చూడమ్మకాతాలో పెద్దపద్దు.

'ఓసి ముండాకూఁతురా! పూర్వజన్మంలో ఎవరితాడో తెంపావు, ఇప్పుడిల్లా తెంపుకున్నావు. అత్తిల్లు అవడోలుచేసి మాయింట్లో అంగడి పఱుచుక్కూచున్నావు' అని మాణిక్యము చూడమ్మను వేదాంతశాస్త్రముతో తిట్టెను.

సంఘమువారుగూడ నపుడూరక చూచుచుఁ గూరుచుండలేదు. 'ఎన్నఁడూ లేని బాపనోరి ఆచారం మొదలుపెటితే బెడిసికొట్టదూ?' అని వారు సనాతనమతముతో తిట్టిరి.

చూడమ్మ తండ్రిపేరు రామస్వామిగుప్త. ఇంటి పేరు జనములవారు అతనికి కోస్తావ్యాపారమును, బట్టల అంగడియు, వడ్లమరయును గలవు. "చిల్లర శ్రీమహాలక్ష్మి" యని యతఁడు చిల్లర దుకాణమును విడనాడలేదు. చిన్ననాఁడే అతఁడు బి.ఏ. పరీక్ష ప్యాసాయెను. ఇంత లౌకిక సంపత్తి యున్నను కొన్ని ప్రాంతములలోఁగల 'మధ్యాహ్నపు మాదిగవాళ్లు' అను కళంకము నతఁడు తన యాచారముచే క్షాళనచేసివయిచెను. గర్భాష్టమములలో కన్యాదానముచేసి దాని ఫలము నతఁడు దక్కించుకొనఁగలిగెను. గాని అల్లుని మాత్రము దక్కించుకొలేకపోయెను. దేవుఁడు చేసినదాని కెవఁడేమి చేయఁ గలఁడు?

తల్లి కనుఁగొనిన పూర్వజన్మదోషమును, సాంఘికులు కనుఁగొనిన పరధర్మావలంబనమును, తండ్రి కనుఁగొనిన దైవేచ్ఛయుఁ గలిసి లోకకల్యాణముగామాటి చూడమ్మపస్తైను పుటుక్కున త్రెంపి వయిచెను.

తానును సుబ్బారావును గలిసి చేసికొనిన పెండ్లి నేఁటికిని చూడమ్మకు గుఱుతు. ఈ పెండ్లి గుఱుతుండుటకు చాలఁ గారణములుగలవు. చూడమ్మకు సుబ్బారావు హంసాయీ. అతఁడు తండ్రిని బలిగొని పుట్టెను. పదపడి గుప్తదంపతుల యింటిలో మగపిల్లలు లేని లోటును తీర్చెను.

పెండ్లికాకమునుపు చూడమ్మ సుబ్బారావులు పలుమాఱులు పెండ్లియాట లాడుకొనిరి. ప్రతి పర్యాయమును సుబ్బారావు ఏదియో కారణమున – సరియగు కారణమే కావచ్చును: కారపుపూసయో, జిలేబియో తక్కువ వచ్చియుండును గావున అతఁడు అలిగి పెండ్లి పీటఁమీఁదనుండి లేచిలేచి పోయెడివాఁడు. చూడమ్మ ఏఱుకొని ఒడిలో దాఁచికొనిన పదిపెద్ద పకోడీలు శుల్కముగా పుచ్చుకొనినపిదపనే కుదురుగా కూరుచుండెడివాఁడు.

(ఖ)

చూడమ్మతలను మంగలవాని కప్పగింపవలసిన సుముహూర్తమునకు ముందు గుప్తదంపతులు చాల గడబిడలలోనుండిరి. 'భర్త ఆస్తి భార్యదా? లేక భార్య ఆస్తి భర్తదా?' అను వివాదము అపుడు సంభవించెను. 'భార్య ఆస్తి భర్తదే' అని శ్రుతిస్మృతి ప్రమాణములతో వియ్యపురాలు యుద్ధమునకు మోటుకొనెను. "చనిపోయిన తరువాత మగనిహక్కు మగువదే" యని మాణిక్యమ్మయు ఆ ప్రమాణములతోడనే డీకొనెను. ఈతగవు తీర్చుటకు తలచెడిన తలిరుఁబోఁడులు తలవెంట్రుకలంతమంది నిండోలగ ముండిరి.

"నీవు మాణిక్యమ్మను వెనకేసు కొస్తున్నావు. వాళ్లు ధనికులనిన్నీ, గ్రామబలమును చూచుకొనిన్నీ చెపితేసరా?" అని ఒక న్యాయవాదిని దెప్పఁగా "నీవు నాంచారును వెనకేసుకురాలేదూ? ఫీజుకోసం నోరు పాడుజేసుకోగూడదు" అని మఱియొక న్యాయవాదిని చేతులుత్రిప్పెను. 'నీకు అరిచేతులో పళ్లున్నయ్యే!' అని యొకతె యనఁగా 'నీనాలుకలో నాభి ఉన్న'దని మఱి యొకతె యనెను. ఇటు లాన్యాయవాదిను లందఱును న్యాయముకొఱకు ప్రాణములనయినను ఈయఁదలఁచుకొని యుండఁగా సుబ్బారావు దొంగవలె తొంగిచూచి పురుగువలె ప్రాఁకి చూడమ్మకడకు వచ్చెను.

చూడమ్మ ఆ వివాదరసమున మునిఁగియుండెను. సుబ్బారావు వచ్చి మెల్లగా చూడమ్మను గిల్లెను. చూడమ్మ దద్దరిల్లి చూచెను. సుబ్బారావు తన అరచేతి వెనుకభాగమును మూతి కానించుకొని కన్నులను ముఖమును ఒక వింతభంగిగాఁబెట్టెను. ఈ భంగిమవలన వియ్యాలవారి యీవేడుకకన్న పెద్దవేడుక యేదియో యొకటి కలదని చూడమ్మ గ్రహించి స్వరము తగ్గించి 'ఏమిటి?' అని యనెను. 'మాయింట్లో యెవళ్లూ లేరు. అక్కడచాలపెద్ద

తమాషావుంది. పకోడీలు కూడా ఉన్నయ్' అని భూదేవిని సాక్షిగా పెట్టుకొనినటులు నేలఁ జూచుచు సుబ్బారావు మెల్లగా ననెను.

చూడమ్మ మొగము తామరపూవయిపోయెను. లోఁగడ సుబ్బారావెన్నఁడును అట్టిగౌరవమాడుఁదాని కిచ్చియుండలేదు. కావున చూడమ్మ వెంటనే 'సైఁ'. అనెను. సుబ్బారావు 'దబ్బున రా' అని ప్రాణపణముగా ప్రాఁకిపోయెను. చూచుచున్న చూడమ్మ కా విద్య వెంటనే వశ్యమాయెను. కొలఁది నిమిషములలోనే చూడమ్మ సుబ్బారావుమేడ యెక్కి అచట నున్న తమాషాయంతయుఁ జూచి విస్తుపోయెను : పసుపుబట్టలు! నల్లపూసలు! మంగళసూత్రము! అక్షింతలు! కొబ్బరి బొండములు! కారపుపూస! జిలేబి! పైని పకోడీలు!

చూడమ్మ 'ఇప్పుడు పెళ్లి చేసుకోవచ్చా?' అని ధర్మశాస్త్ర మడిగెను.

'ఓ చేసుకోవచ్చు. ఢంకామీఁద దెబ్బకొట్టి చేసుకోచ్చు. మనూళ్ళో మొన్న చేసుకోలా రాధాగుపత? ఊరేఁగుతుంటే మనం చూడఁబోయేతలికె మీ అమ్మ తలుపులు తియ్యాలా?' అని సుబ్బారావనఁగనే చూడమ్మ అతనిని కౌఁగిలించుకొని గిర్రున తిప్పి తానును గిరగిర తిరిగెను.

వెంటనే వారిరువురును పసుపుమధుపర్కములు ధరించిరి; పెండ్లిపీఁట లెక్కిరి; చెఱియొక కొంతసేపును పౌరోహిత్యము నెఱపుకొనిరి.

'చూడమ్మ నడుమ నడుమనొక మొట్టికాయ తిని తన భార్యాత్వమును చక్కగా పరిపాలించెను' అనాఁడు సుబ్బారావు పీఁటమీఁదినుండి యొక యంగుళమేనియు జరుగలేదు. పకోడీలు నములుచు, వారు తలఁబ్రాల లోనికిదిగిరి. అవి వారితలలేకాక మేడక్రిందివారి తలల గూడ నభిషేకింపఁదొడఁగెను.

ఇంతలో రసభంగమాయెను. రసముజోలియేమి? పెండ్లియే భంగము కావలసివచ్చెను. వా రాగది తలపులు వేయుట మఱచిపోయిరి. పెండ్లియాట పకోడీల యాటలో పడిన తరువాత వారీదరిద్రలోకమును విస్మరించిరి.

అచట రాహుకాలము సమీపించెనని మంగల వాఁడు తత్తఱపడెను. గుప్తదంపతులు చూడమ్మకొఱ కిల్లంతయు గాలించిరి. 'ఎంత చిన్నకట్టె అయితే మాత్రం యేం? ఆఁడ పుటక పుటితే తెలియదా? ఏ నూయే చూసుకుందో, ఏగోయే చేసుకుందో' అని మాణిక్యమును, రామస్వామిగుప్తయు లోఁతు లోఁతు చోటు లన్నియు వెతకి వేసారి యాయింటి నూతికడకు వచ్చిరి.

మేడమీఁదనుండి అక్షింతలు రాలుచుండెను. వా రదిచూచి గబగబ మేడ యెక్కిరి. వారెంత లోఁతున వెదకిరో చూడమ్మ అంతయెత్తుననే యుండెను. వారెంత యమంగళమును శంకించిరో అంత మంగళమునే చూచిరి.

చూడమ్మను సుబ్బారావు కిచ్చుటకుగుప్త విశ్వప్రయత్న మొనరించెను. 'చూడా, నీ వెవరిని చేసుకుంటావే?' అని అడుగఁగా 'సుబ్బారావును చేసుకుంటాను' అని పలికెడిది. కాని మాణిక్యము పడనీయలేదు – 'మేనఱికము మీఱుట మహాపాతకము' అని సనాతనముకదా! అందులో మాణిక్యము సనాతన మతమున అచ్చాణిముత్తైము!

వీరు సొంతముగా కట్టుకొనిన ఈ మంగళసూత్రమును చూడఁదలఁచియు చూడఁ జాలక గుప్త తన మొగముమీఁద గుడ్డవేసికొనెను. 'నీ కీ పిశాచపు ఆట యెవరు నేర్పారే?' అనుచు పరుగెత్తి మాణిక్యము కూఁతిరి ముడ్డిమీఁద రెండంటించి 'ఈతడవ ఈమేడ యెక్కిచూడు' అని ముక్తాయి యిచ్చెను.

చూడమ్మ ఏడువలేదుగాని సుబ్బారావేడ్చెను. ఆ యుత్సవము తనకుఁగూడ జరుగఁ గలదనియో, లేక చూడమ్మకు జరిగిన దనియో యెవరు చెప్పఁగలరు?

మాణిక్యము జుట్టుపట్టుకొని చూడమ్మను ఈడ్చుకొనిపోయెను. వెంటనే సుబ్బారా వేడ్పుమానెను. ఇంతలో రాహుకాలము వచ్చివేసెను. దాని బలముననో, లేక యీపిన్నవారు లంగించుకొనిన లగ్నబలముననో నాఁటి కేశఖండనము నేఁటివఱ కాఁగిపోయెను.

(గ)

మాణిక్యమున కింకకను ఇరువదియయిదేండ్లు దాఁటలేదు, గుప్త కిరువాదియాఱు దాఁటలేదు. ఈ పిన్నదంపతులనడుమ ఈ బాలవిధవ.

చూడమ్మ రామస్వామిగుప్త కల్లారుముద్దుబిడ్డ. తల్లి కోకిలవలె కని పాఱవయిచెను. దాది పాలిచ్చెను. తక్కిన పోషణమెల్లయు కాకిదివలె తండ్రిది. అట్టి తండ్రికి ఆ బిడ్డ యిపుడు పెద్దపులి అయిపోయెను.

స్వర్గ, నరకలోకముల భూగోళ శాస్త్రము, అచట చనిపోయిన మగఁడుగాని భార్యగాని ఉండుచోటు, అచటనున్న భర్తలకును భూలోకమునందున్న భార్యలకును గలసంబంధము, విధవల వేషభాషలు వగైరాలు చక్కగా తెలియునటులు మాణిక్యము కూఁతిరికి బోధింపఁదొడఁగెను.

పెండ్లిలో మగని మొగమును తిన్నగాఁ జూచిన గుఱుతు చూడమ్మకు లేదుగాని యిపుడీ తల్లి చెప్పిన పాఠమువలన తా నూహించుకొనిన మగనిరూపము ఎదుట నున్న చిత్తరువునంత విశదమైపోయెను. మనోనేత్రమున ఆ రూపము కానఁబడఁగనే చూడమ్మకు చెమటపోసెడిది. వెంటనే చూడమ్మ తండ్రికడకు పరుగెత్తెడిది.

రామస్వామిగుప్త ఈ గాబరా గమనించి 'ఏమమ్మా, ఒడలంతయు చెమట పోసినది' అని అడుగఁగా చూడమ్మ ఏడ్చుటతక్క మఱియొక సమాధానము చెప్పఁజాలక పోయెడిది.

తల్లి నియమించిన యాహార మాఱునెలలు ఒంటపట్టఁగనే చూడమ్మ శరీరమును ఎనాటమీ విద్యార్థులు బేరమాడఁదొడఁగిరి. ధర్మశాస్త్రమునందు మిక్కుటయిన శ్రుత పాండిత్యము కల అత్తమ్మరి సూరమ్మగారు ఒకనాఁడు మాణిక్యమును చూడవచ్చి ఆమె పరకాష్ఠకు విస్తుపోయి – వేషభాషలు వేయించవచ్చును. గాని కడుపు మాడ్చఁగూడదు. ధర్మమును సాధించుటకు శరీరము ఉండవలయునుగదా?' అని విధవాధర్మరహస్యమును టూకీగా తెలిపిపోయిరి. తుద కీమయినపుబొమ్మకు మందు చూడవలసివచ్చెను.

హకీములును, భిషజ్మణులును, డాక్టరులును దొడ్డదొడ్డ మందులజాబితాలు వ్రాసియిచ్చిరి. లక్ష్మీదేవికి సూక్ష్మ శరీరములయిన ఆ మందులు తుట్టతుదకు కర్మ విపాకమును సూచింపఁదొడఁగెను. కాని ఆ రోగనిదానమును చూడమ్మయే ఒకనాఁ డిటులు కలవరించెను: "అమ్మొచ్చె అమ్మొచ్చె! ఈయాటొద్దు ఈయాటొద్దు! పారిపోదాం పారిపోదాం సుబ్బారావుబావా చచ్చి పోతున్నా."

మాణిక్యము ఉలికిపడి లేచి ఈ కలవరింత వినెను. నిదురపట్టక యటునిటు కొట్టుకొనుచున్న రామస్వామి గుప్త విని 'కలలోఁగూడ నీబెదురేనా?' అని యనెను.

"మావాఁడుకదా యని చెప్పడానికి నోరు రాలేదండోయ్. వాఁడే దయ్యమయి పట్టుకున్నాఁడండోయ్! లేకపోతే పిల్ల ఇల్లా అయిపోతుందండోయ్! చచ్చిపోయినా వాఁడి కింకా మనసు తీరలేదండోయ్' అని మాణిక్య మొక దీర్ఘము తీసెను.

'కుంఫిణీవారి యేలుబడిలో దయ్యము లన్నియు ఆవిరిగా మాఱిపోయినవి' అని గుప్త యనెను.

'మఱీ విడ్డూరం, అమ్మాయికి విభూతి పెట్టించండి.'

'శాశ్వతముగా పెట్టించితిని.'

'దయ్యాలు లేవంటారా?'

'నేను కాదుగదా, నాకు ఆవల ఏడుతరముల వారుగూడ ఆ విషయమున జాత్యంధులు. ఒకవేళ నీకు భూతదృష్టి ఉండియుండవచ్చును.'

మాణిక్యము చిరాకుపడి చూడమ్మ మొగమును పరీక్షించుచుండెను. చూడమ్మ ఉలికిపడిచూచును గదా మొగములో మొగముపెట్టి చూచుచున్న తల్లి!

'అమ్మో చంపేస్తుంది సుబ్బారావుబావా?' అని చూడమ్మ కంకపట్టుపట్టి యేడ్వఁ దొడఁగెను. మాణిక్యము అదిచూచి – 'నారసింహమంత్రం పెట్టే ఆశాస్తుల్లు గారిని తీసకరండి' అనెను.

'నీ వెడముగా నున్నచో దయ్యము పాఱిపోవును' అని గుప్తయనెను. మాణిక్యము రుసరుసలాడుచు దూరముగా తొలఁగెను. గుప్త జోలకొట్టఁగా చూడమ్మ అనతి కాలముననే నిదిరించెను. గుప్తయు మఱి మాటాడక తనశయ్య నాశ్రయించెను. మాణిక్యమేమి గొణఁగుకొనెనో వినఁబడలేదుగాని ఆ మఱునాఁటినుండియు రామస్వామిగుప్త కామె ప్రవర్తనలో కొంచెము మార్పు కానిపించెను.

(ఘ)

'ఏమిటి చూచుచున్నావు?' అని గుప్త యడిగెను.

'దీని కలవరింతలకు భయమువేసి బడిలోనికిఁ బంపితిని ఇంకను రాలేదు. అందుకు చూచుచున్నాను' అని మాణిక్యమనెను.

'అటులనా?'

ఆఁడపిల్లల బడినుండి చూడమ్మ తనయింటి సందువఱకు లేడివలె వచ్చెను. అచట ఆ బాలికకు మందగుది తగిలెను. గుమ్మముమీఁద కాలువెట్టి తల్లిని జూచువఱకు కలకలలాడు చూడమ్మ మొగము కాటుక యయిపోయెను. మాణిక్యమా మార్పుగ్రహించెను.

చూడమ్మ లోనికేగి తన పుస్తకములు సర్దుకొనుచుండెను. తల్లి యచటి కేగి బట్టలు మార్పించి 'అమ్మాయీ, కాసేపు సుబ్బులు బావతో ఆడుకొనిరా' అనెను.

'నీవు కొట్టవూ?' అని చూడమ్మ యనెను.

మాణిక్యము నవ్వి 'కొట్టను' అని యనెను.

'నన్నుకొడితేమానే; బావను?'

'కొట్టనమ్మా కొట్టను. నిన్నూ కొట్టను; అతగాణ్ణీ కొట్టను'

'నాన్న కొట్టరూ?'

'నాన్నా కొట్టరు. ఆ భయం పెట్టుకోకు ఆడుకోరాపో.'

"పొద్దుపోతే నే నివ్వేళ అక్కడే పడుకోచ్చా?'

'పొద్దుపోకుండా పిలుస్తాలే.'

'పోనీ బావని తీసుకో రావచ్చా?'

'అతని మామ రానియ్యడమ్మా. అదిగాక అతగాఁడు చదువుకోఁడూ?'

'పోనీ ఇద్దఱుమూ ఇక్కడే చదుకోమా?'

'సరేలే, ముందుపోయి ఆడుకోరా, నేను కేక వెయ్యంగానే రా యేం?'

తనతల్లి అనుకొనని అనుమతిని ఇటులు ఈయఁగనే ఆ యింటికిని ఈ యింటికిని నడుమనున్న యిఱుకు సందునఁబడి చూడమ్మ తుఱ్ఱుమనెను.

సుబ్బారా వంతకుముందే బడినుండి వచ్చెను. డాబామీఁద మూన్నాళ్లనుండియు నతఁడొక నూయి తవ్వుచుండెను. నేఁడది పూర్తి చేయుటయే కాక పలుదెసలకును కాలువలను గూడ ఏర్పాటుచేసెను. ఇప్పుడు పాతాళగంగ దెచ్చి యాకాశగంగ చేయుటకు ఉపక్రమించెను. అంతలో చూడమ్మ యెదురాయెను. అతఁడానూతఁ గూలెను.

'భయపడకు భయపడకు! మా అమ్మ కొట్టనన్నది గా' అని చూడమ్మ యనెను.

'కొట్టరూ?'

'ఊఁహు.'

'ఎందుకు కొట్టరు?'

'పాపం నా మొగుడు చచ్చిపోయాఁడని.'

'ఔను పాపం...నీ మొగుడు చచ్చాడు కాదూ?'

'ఆఁ'

'అయితే చచ్చినవా ళ్లేమవుతారు?'

'ఇంతేనా? నీకుతెలియదూ? నిన్నడుగుదామనుకుంటున్నాను'

'బళ్లో మాకింకా ఆ పాఠంచెప్పలేదు.'

'అల్లాగా? మా అమ్మ కన్నీతెలుసు. అంథా మా అమ్మ చెప్పినట్లే అవుతుంది.'

'పెద్దవాణ్ణయితే నాకూ తెలుస్తుంది.'

'రాత్రి ఏమయిందనుకున్నావు? కొండంత కలవచ్చింది.

'ఏది చెప్పు?'

'నేను మా అమ్మ చెప్పిన స్వర్గలోకంలోకే ఎగిరిపోయాను. అక్కడ పాపం నా మొగుడున్నాడు. ఆమొహం చూడంగానే నాకు చచ్చేటంత భయం వేసింది.'

'నన్ను పిలవకపోయావా?'

'పిలువలేదేం? నిజంచెప్పు!

'నాకు వినబడందే?'

'వినఁబడ్డా లేదంటావు? మట్టుగా అక్కణ్ణుంచి ఇక్కడికి, సరిగ్గా ఇక్కడికే కూలిపోయాను. ఎంతదెబ్బ తగిలిందనుకున్నావు?'

'జామా ఆయిల్ రాసుకోక పోయావా?'

'తెమ్మంటే నీవు తేందే చగురుడల్లే? సరే; ఆపళంగా ఆడుకుందాం రమ్మని లాక్కోపోయావు. పెళ్ళాట అయితే అమ్మొచ్చి అంటిస్తుందని అంటూ ఉండంగానే అమ్మొచ్చింది. రా రా రా అని ఎంత మొత్తుకున్నా నీవు రాందే. అమ్మ రానేవచ్చింది;

గొంతు పిసకనే పిసికింది. ఎందుకమ్మ నీతో ఆడుకోటం? చస్తూంటే చూస్తూ కూచుంటావు. జిల్లాయిలు పెట్టేదా?'

'వొద్దు వొద్దు.'

చూడమ్మ జిల్లాయిలు పెట్టుటకు మెలమెలగా వేళ్లు సవరించెను. సుబ్బారావు వెంటనే ఆ వేళ్లను అంటించి 'ఇదుగో చూస్తూ కూచుంటా ననుకున్నావు? నిన్నెత్తుకోపోయి ఎగిరెగిరి అక్కడికి పోతాను' అని వేలితో ఆకాశము చూపి 'అక్కడ పెళ్లి చేసుకుంటాను. ఏం?' అనెను.

'చూదాంగా' అని చూడమ్మ అనుచుండంగా మాణిక్యము బిగ్గఅగా 'అమ్మాయీ' అని పిలిచెను. సుబ్బారావొక వెఱ్ఱిచూపు చూచెను. చూడమ్మ యిటులనెను. 'మాయింట్లో పడుకుందు గాని రావూ? పకోడీలు చేశారు.'

'ఉఁహుఁ. ఇక్కడే పడుకుందాం ఉండు. ఇవ్వాళే వెనకటిలా కాకుండా మామయ్యచేత గదికి గడియలు వేయించేదాం.

'చూడా?' అని మాణిక్యము త్రిమాత్రాకాలము ఉపయోగించి పిలిచెను. ఆ పిలుపునకు చూడమ్మ ప్రత్యుత్తరించిన 'ఆఁ.' అను అచ్చు హ్రస్వమో, దీర్ఘమో, లేక ప్లుతమో యే వైయాకరణుఁడును చెప్పఁజాలఁడు. ఫోనెటిక్సులో అది క్రొత్తస్వరము. అది సుస్వరమో, లేక అపస్వరమో యేగాయకుఁడు కనుఁగొనఁగలఁడు?

తమ కూఁతురి శరీరవీణ యెంతకంపించెనో ఆ తలిదండ్రులు ఆ స్వరమువలన కనుఁగొనిరి. దానికి ప్రతిఫలముగా చూడమ్మ సుబ్బారావుతో సహ తమ యింటికి వచ్చెను.

(జ)

చూడమ్మ విధవాధర్మమునుండి యిటులు మనుష్యధర్మములోఁ బడినతరువాత రామస్వామి యిల్లు మరల నెప్పటివలె నాయెను. మయినపుబొమ్మగా మాఱిన చూడమ్మ మరల కుందనపుబొమ్మ యాయెను.

గుడ్డపేలికవలె నయిన రామస్వామి క్రమక్రమముగా కోలుకొనెను. మాణిక్యము యొక్క మనస్సే కాక శరీరముగూడ మాఱెనని రామస్వామి కనుగొనుట అరిది. ప్రతిదిన మెల్లపుడును చూచువారికి శరీరముయొక్క హానివృద్ధులు తెలియవు కదా! కాని క్రొత్తగా చూడవచ్చినవారికి అతిసులభముగనే ఆ సంగతి తెలియవచ్చెను. 'ఆ యింటికి ఇఁక ద్వారబంధములు కొంచెముపెద్దవి చేయించుకొనవలసి యుండు'నని వారనుకొనిరి.

'సంసారికి తన కుటుంబమే బ్రహ్మాండము. తన సుఖమే స్వర్గము; తన దుఃఖమే నరకము. ఇట్టి కూఁతుండ్రు, ఇట్టి తలిదండ్రులు ఈ భరతఖండమున నెందఱు కలరో

కదా! ఇట్టి భరతఖండములీ విశ్వమున నెన్నియో! అందు ఈ జీవియెంత? దీని సుఖమెంత? దీని దుఃఖమెంత? ఇది లీలయా, ఖేలయా? ఇది సత్యమా, అసత్యమా?' అని రామస్వామి యనుకొనెను.

చూడ బడివదలిపెట్టి చూడఁజూడ చూడమ్మ యాయెను. సుబ్బారావుబావగూడ సుబ్బారావుగారయిరి. చూడమ్మ యిపు డుపాధ్యాయులకడ నింత యింగిలీషును, ఇంత సంస్కృతము, నింత తెలుఁగును, ఇంత గానము, నింత చిత్రకళను, అభ్యసింపఁ దొడఁగెను.

సుబ్బారావు జేబులో నొక గడియారము బంగారుగొలుసుతో సహా ప్రవేశించెను. మనికట్టును మఱి యొక గొలుసు ఆంజనేయవిగ్రహముతో నలంకరించెను. అతఁడు హైస్కూలును వదలిపెట్టెను. అతని మామ గృహపరిపాలనము చేయఁబూనుకొనెను. అతఁడు చదువులకుఁ జెన్నపట్టణము ప్రవేశించెను.

చక్కగా సంసారము చేయుచున్న యిల్లాండ్రందఱకువలెనే మాణిక్యమునకును రెండుమూడు కానుపులు వచ్చిపోయెను. మాణిక్యము మరల దృఢప్రతిజ్ఞ తోడనే యుండెనుగాని రామస్వామి మాటమాత్రము చెప్పలేము.

కన్యలందఱవలె చూడమ్మ ఏకాంతమునందు తిలకము దిద్దుకొనును. కాని కొంచెముసేపు ఉంచుకొని అద్దములోఁ జూచుకొని పిదప చెఱిపివేసికొనును. తండ్రి తన కేఱికోరీ పంపిన వలువలలో మేలి వేఱి ధరించి వెంటనే విసర్జించును. అత్తగారు హరించినందువలన రెట్టిగా లభించిన నగలు దాల్చి తీసివేయును. వీని కన్నిటికిని శిరోభూషణముగా సరస్వతిని తలఁదాల్చును. 'దీని మగఁడు చావలేదు; ఎక్కడో కనఁబడకుండా ఉన్నాఁడు' అని మాణిక్య మొకానొకపుడు భ్రమించుచుండెను.

ఒకనాఁటి ప్రొద్దున విధవోద్ధారకసభవారు ఒక పెద్దపద్దు కాకితముతో రామస్వామికడకు వచ్చిరి. రామస్వామి వారి కాతిథ్యమిచ్చెను. వారు దానికి బదులుగా అతనికి ఈ పద్దుకాకిత మిచ్చిరి. రామస్వామి దానిని పరిశీలించి ఇంటిలోనికి పోయి కొన్ని కాకితములు తెచ్చి వారికి సమర్పించెను.

సభానాయకుఁడు ఆ కాకితములు విప్పెను - నూఱు రూపాయలనోట్లు పది! సభానాయకునితో పాటు సభవారందఱును తమసంతోషము నీ రీతిగా విశదీకరించిరి: 'అయ్యా, తమచేతితో తమ పద్దు వ్రాయింపుఁడు.'

రామస్వామియిటులనెను : "లక్ష్మీ ప్రసాదమయిన తరువాత సరస్వతీ ప్రసాదమున కాసింతురా? సరస్వతిముందు; లక్ష్మివెనుక. లక్ష్మి ముందయినచో సామాన్యముగా సరస్వతి యుండదు."

చూడమ్మ యిపు డొక భావనాప్రపంచమును సృజించుకొనఁగలదు; ఆ సృష్టిలోని మంచిసెబ్బరలను గ్రహింపఁగలదు. తా నందు విహరింపఁగలదు. జీలకర్ర యయినను, జీవగర్రయయినను ఆమెకు శేషించిన దా భావనాప్రపంచమే.

ఇట్టి మనోలోకమున ఒంటిగా నున్న చూడమ్మ చనిపోయిన మగని బరువును మోయుచుండఁగా చూడఁ జాలనటులు ఒకనాఁడు ఆ ప్రక్కనున్న మూగమేడ ముఖరితము కాఁజొచ్చెను.

## 2

### (క)

పరీక్ష లగుటచే సుబ్బారావింటికి వచ్చెను. సామాను సర్దుకొని వెంటనే అతఁడు రామస్వామిగారి యింటికివచ్చెను.

"సుబ్బారావు మమ్ములను మఱచిపోలేదు" అని మాణిక్య మనెను.

"శరీర మారోగ్యముగ నున్నదా? పేపరు సరిగా వ్రాసితివా" అని రామస్వామి యడిగెను.

"సుమారుగావ్రాసితిని" అని సమాధానము చెప్పుచు సుబ్బారావు వారిరువురకును నమస్కరించి వారిదీవన లందుకొనెను.

తన గదిలోఁగూరుచుండి యేదియో ఆలోచించుకొనుచున్న చూడమ్మ ఒడలెల్లయు చెవులుచేసి కొని ఆ మాటల నాలకించెను. అతనిని చూచుటకు లేచియు మరలఁ గూరుచుండెను. సంతోష దుఃఖములు ఛాయాతపములవలె నామె నాచ్ఛాదించెను.

"చూడ ఇంటిలో లేదా" అని సుబ్బారావడిగెను.

"అది యెక్కడికిపోతుంది నాయనా? ఇంటిలోనే వుంది" అని మాణిక్యము సమాధానము చెప్పి "చూడా" అని పిలిచెను.

సుబ్బారావు మెడయెత్తి తలుపువంక జూచెను.

తల్లి పిలిచిన పిలుపునకు చూడమ్మ ప్రత్యుత్తరించిన "ఆఁ" అను స్వరము మందరమో, అనుమందరమో చెప్పుట దుస్తరము కాని సుబ్బారావు మాత్రము సుందర మనుకొనెను. కొంచెముసేపటికి చూడమ్మ మెల్లగా బయటికి వచ్చెను.

సుబ్బారావు చూడమ్మనుజూచి రెండేండ్లు దాఁటెను. రెండేండ్లలో నెన్నేని మార్పులు జరుగువచ్చును. చూడమ్మ ఇపుడు వెనుకటి చూడమ్మ కాదు. చూడమ్మ శరీర మిపుడు పరిమళించు బంగారము. ఆ మోము మాటలు నేర్చిన చందమామ. ఆ చూపులు మంత్రము లుచ్చరించు తూపులు. ఆ నవ్వు వాడని పువ్వు. ఆ పాదములు నడయాడు పద్మములు.

ఆ మాట పాడని పాట. ఇట్టి చూడమ్మ యెట్టెదుటికి రాఁగనే సుబ్బారావు కన్నులు నిండిపోయెను. 'చూడమ్మ ఇంటిలో లేదా' అని యడిగిన సుబ్బారావిపుడు 'కిమన్నాస్తి'. చూడమ్మ అంతకంటె.

ఈ మూగతనము తమ యిరువురకేకాక మాణిక్యమునకుఁగూడ సహింపని దాయెను. రామస్వామి నిట్టూర్చి మెల్లగా మెల్లలోని కేగెను. ఆ గోష్ఠిలోని దుఃఖమును ఏవమును సిగ్గును పోఁగొట్టుకొనుటకు చూడమ్మ చాల ప్రయత్నించియు విఫలమాయెను. ఇంతలో సుబ్బారావు ధైర్యము తెచ్చికొని "నిన్నుఁ జూచి రెండేండ్లయినది" అనెను.

చూడమ్మ మోమెత్తెను. ఈ సుబ్బారావు వెనుకటి సుబ్బారావుబావ కాఁడు. అతని గండఫలకములు నిగనిగలాడుచుండెను. నూనూగుమీసములు గల అతని ముఖము చూడ ముచ్చటగా నుండెను. శరీరభంగియందును, మాటతీరునందును చమత్కారము వెలసెను. అతఁడాఁదరాజ్యమునుండి మగరాజ్యములో ప్రవేశించెను. ఇట్టి సుబ్బారావును జూచి రిచ్చపడి చూడమ్మ "రెండేండ్లకు రెన్నెలలు తక్కువ" అనెను.

ఇటులు నెలలతోఁగూడ లెక్క చెప్పుటవలన సుబ్బారావుముఖము ఆలోచనచే నుద్దీప్తమాయెను. మెల్లనుండి లోనికి వచ్చి రామస్వామి "ప్రొద్దున ఎప్పుడు తిన్నాఁడో! చీకటిపడకముందు వంటకానీ" అనెను.

"మఱేమి తొందరలేదు. అన్నము తిననినాఁడే కడుపు బరువెక్కును. మెల్లగా కానీండు సెలవు" అనుచు సుబ్బారావు వెళ్లిపోయెను.

(ఖ)

సుబ్బారావుకు ఆ పూఁట ఆఁకలి యెక్కువగనే వేసెను. కాని పిలుపునకుముందు వెళ్లఁగూడదను బిగితనముకూడ నెక్కువగనే యుండెను. మాణిక్యము వంట చేసి పిండివంటకమునకు సెనగపిండి కలిపెను. బూంది దూయవలయునని యామె సంకల్పము. ఇంతలో ఱంపపుపొట్టువలె తఱిగిన ఉల్లిపాయలను చూడమ్మ అచటికి తెచ్చెను. దానిని జూచి మాణిక్యము 'అతనికి పకోడీ లిష్టమాయేమి?' అని యడిగెను. 'నీవు పకోడీలే తలపెట్టితి వనుకున్నాను; పోనీ అవీ ఇవీ కూడా చేస్తేసరి" అని చూడమ్మ అనెను. "మీ నాన్న ఉల్లిముట్టరు. నీవే పకోడీలు చివరికి వెయ్యి" అని మాణిక్యము బూంది దూయఁదొడఁగెను.

చూడమ్మ భోజనశాల తుడిచి పీఁటలు వేసి విస్తళ్లు పఱచెను. తల్లి పని అయిన తరువాత ఆమె పకోడీలు వండఁగూరుచుండెను. ఆమె మనస్సులోని సంతోషమును గర్భీకరించుకొనినటులు కొన్ని పకోడీలు పొంగెను. పరిహసించుచునటులు కొన్ని

వంకరటింకరలాయెను. కోపమును సూచించుచు కొన్ని కరకరపాకమునఁబడెను. కొన్ని ప్రేమను విశదీకరించెను.

రామస్వామి జపగృహమునుండి వెలికి వచ్చి "అమ్మాయీ, వంటఅయిందా?" అని అడిగెను. బాణలి క్రిందదింపుచు చూడమ్మ 'అయిం-ది' అని అనుచుండఁగ 'అయింది, సుబ్బారావును పిలవండి' అని మాణిక్యము అనెను. రామస్వామి దొడ్డిలోనికిఁజని 'సుబ్బారావూ' అని ఆహ్వానించెను. "వచ్చె వచ్చె" నను ప్రత్యుత్తరముతోపాటు పట్టుతాపితాతో సుబ్బారావు వడివడిగా వచ్చెను.

మాణిక్యము వడ్డన చేసెను. అభిఘరించిన పిదప"చూడా, అతని విస్తట్లో పకోడీలు వడ్డించూ' అని మాణిక్య మనఁగానే చూడమ్మ వచ్చి అతని విస్తరిలో వానిని జాఱ విడిచెను.

సుబ్బారావు దృష్టి చూడమ్మ మీఁదికంటె వాని మీఁదనే యెక్కుడుగా ప్రసరించెను. తలుపుచాటున నున్న చూడమ్మ అతనియేకాగ్రదృష్టిని పరికించెను. పరితృప్తమగు నామెముఖము క్షణక్షణమున నొకొక్క కళచే నలముకొని క్రమక్రమముగా పదునాఱు కళలచే పరిపూర్ణమాయెను.

సాపాటు సాఁబాలు కాఁగానే భోజనశాల సభాశాలగా మార్చనియెడల ఆఁడవారికి చప్పగా నుండును. సంయమము లేనివారు దానిని రచ్చగా మార్చక కూరుచుండలేరు. ఇట్టివారిలో మాణిక్యము మేటి. "ఈ శారదాభిల్లుఁడు ముందు బతికేయెత్తు ఉన్నట్లులేదు" అని ఆమె ప్రస్తావించెను.

కొద్దిరోజులనుండియు సుబ్బారావు మనుచరిత్రము చదువుచుండెను. దానిలోని 'శాంబరీ భిల్లుఁడు' గుఱుతువచ్చి అతఁడు కొంచెము నవ్వెను. అపుడు అచటికి అతనిమామ వెంకటేశ్వర్లు వచ్చెను. చూడమ్మ పీఁట వేసెను. అతఁడు దానిమీఁదఁ గూరుచుండెను.

మాణిక్యము మరల నిటులనెను : "పెండ్లి ఎప్పుడు చేసుకుంటావు? బెండకాయ ముదిరినా బెమ్మచారి ముదిరినా పనికిరారు."

వెంకటేశ్వర్లు ఇటులనెను : "సంబంధాలమీఁద సంబంధాలు వచ్చిపడుతున్నవి. పెండ్లిమాట అంటే ఇతగాఁడేమో పెండ్లికూఁతురైపోతాఁడు."

"మాకు ఈ మాటే తెలియదే" అని మాణిక్యమనెను.

"తెలిసి ఏమి లాభము? ముంగలికివచ్చిన లక్ష్మిని కాలితో తన్ని పాఱ వేస్తున్నాఁడు. ఈ యాన్నెల్లనుంచి. కుంచాలవారి సంబంధం అంటే మనలో కోరుకోఁ దగినది గదా! వారువచ్చి దేవులాడి పోయినారఁట పాపం! టెలిగ్రాములకు

వెచ్చపెటుతున్నారు ఎంతయినా! మీ దగ్గిఱ ఈ వర్తమానం పడేస్తే ఫలిస్తుందని నాకు నమ్మకం" అని వెంకటేశ్వర్లు అనెను.

"అయితే ఇఁక లగ్నవిశ్చయం చేస్తాం. ఏమి సుబ్బారావూ మాటాడవు?" అని మాణిక్య మనెను. బదులు పలుకక పీఁటమీఁదినుండి లేచిన సుబ్బారావుకు తలుపుకడ నిలిచి గంభీరముగా నాలోకించుచున్న చూడమ్మ ముఖము కానిపించెను.

(గ)

సుబ్బారావుపెండ్లికి వచ్చిపడుచున్న సంబంధముల నన్నింటిని లెక్కచేయుటకు విసుకు పుట్టెను. పెండ్లి కూఁతుండ్ల ఫోటోగ్రాపుల కొక ఆల్బము చాల లేదు. కట్నములను, కానుకలను, మరియాదలను వ్రాయింపఁదలఁచుచో ఒకగుమాస్తాకు చేయితిరుగని పని.

సుబ్బారావుకు తల్లిదండ్రులు లేకపోవుటవలనను, ఉన్న మామయు చందమామ యగుటచేతను, తాను ఊరక కూరుచుండఁజాలకపోవుటచేతను మాణిక్యమునకు చేతినిండ పనిదొరకెను. సుబ్బారావతి బలవంతము మీఁద పెండ్లికూఁతుళ్ల ఫోటోలామెకు వశపఱిచెను. అందచందములను బాగోగులను నిర్ణయించుటకు మాణిక్యముచూడమ్మ సహాయ మపేక్షించెను. చూడమ్మ ఆ బొమ్మలను జూచి తానును ఒక బొమ్మ యయిపోయెను.

అల్లుఁడు పోయినపిదప చూడమ్మను వెంటవేసికొని మాణిక్యము అనేక పెండ్లిండ్లకు వెళ్లెను. చూడమ్మ వైధవ్యము పరిసిపోయి చాలకాలమాయెను. ఈ సుబ్బారావు పెండ్లిహడావడి యంతయు తనమీఁదుగనే జరుగవలెనని మాణిక్యము – ఊహ. కావున ఈ విచారము చూడమ్మకు విచారము కలిగించు నని మాణిక్యమూహింపలేదు.

చూడమ్మ మనస్సు మొదట కొంచెము కలఁత నొందెను. పిదప దుఃఖమును వశపఱిచికొని చూడమ్మ ఆ ఆల్బమును తెఱచి ఒక్కొక్క బొమ్మనే తిరుగవేయఁ దొడఁగెను. మాణిక్య మాబొమ్మల వంశావళిని సంపత్తిని వర్ణించి చెప్పుచుండెను.

మాణిక్యము చేయు వర్ణనలో ఆకాశపాతాళములే కాని మధ్యమార్గము లేదు. అగుచో రంభ, కానిచో కాకి. అగుచో కోకిల, కానిచో గాడిదె. అగుచో లక్ష్మి కానిచో పెద్దమ్మ. ఇట్టి వర్ణనలతో ఆ ఆల్బములో ముప్పాతిక ముప్వీసము కావచ్చెను. మునిసిపల్ ఆఫీసునుండి టంగుమని గంట వినఁబడెను. పెండ్లికూఁతుండ్ల చరిత్రరచనమునందు తన్మయి యయి యున్నమాణిక్యము తలయెత్తి 'ఒకటి, 'రెండు', 'మూడు', 'నాలుగు',

'అయిదు', 'ఆరు' అని లెక్కపెట్టి 'అమ్మ' అని తత్తఱపడి 'వంటవేళ అయినది' అని దులుపుకొని వడివడిగా స్నానశాలలోని కేఁగెను.

చూడమ్మ అచటనే కూరుచుండి మఱిరెండు మూడు బొమ్మలు తిరుగవేసెను. నాలుగవబొమ్మను తెఱచెను. అది ఫొటోగ్రాపువలె లేదు. అది చేతగీచిన బొమ్మ. దానిని జూచుచున్న చూడమ్మ వ్రేలుగాని, కేలుగాని, కన్నుగాని, వెన్నుగాని కదలలేదు.

ఆ బొమ్మ తనను పోలియున్నటు లగపడెను. పరిశీలింపఁగా దానిపోలిక తనకు చాల దగ్గఱగా నున్నటులుండెను. చూడఁగా జూడఁగా అది తనచిత్తరువే.

చూడమ్మ కనులార్ద్రములాయెను. ఆమె దీర్ఘముగా నిశ్వసించి ఆ చిత్తరువును జూచుచు రెండుచేతుల తోడను రెండుపెడలను గభాలున మూసివయిచెను. ఆమె కనులు ఆ యాల్బము అట్టమీఁదికి వంగియుండెనేకాని ఆమె మనసు ఆ చిత్తరువును గీచినవాని మీఁద వ్రాలెను. అంతట ఆమె అధేరీతిగా లేచి మెలమెలగా గదిలోనికిఁ జనెను.

చొరవచేసికొని సుబ్బారావు ఆ గదిలోనికి వచ్చి చూచుసరికి అల్బములో వేలుపెట్టి కన్నీళ్లతో చెక్కిళ్లు తడిసి మొగమెఱ్ఱబాఱి చూడమ్మ శయనించి యుండెను. ఆమె వడిగాలేచి గోడకేసి తిరిగెను. మరల సుబ్బారావు దెస మోము త్రిప్పఁగనే ఆ కన్నీళ్లు లేవు. మొగమున ఆ ఎఱ్ఱదనమును లేదు. సమ్మోహనవిద్యచే ఆమె క్రొత్తరూపెనసినటు లాయెను. శైశవమునందలి 'చూడ' వలె నతని కపుడామె గోచరించెను. అతఁడు ఆ మార్పునకు ఆశ్చర్యచకితుఁడాయెను. చూడమ్మ యించుకయు సంకోచింపక యిటు లనెను – 'ఆ కుర్చీ మీఁద కూర్చుండుఁడు.

'చిత్తము, అని సుబ్బారావనెను. చూడమ్మ యీ మాటకు కొంచెము నవ్వి "మీరు 'చిత్తము' అననక్కఱలేదు. అది సరిగాని కుంచాలవారిపిల్ల అన్ని విధములా బాగుగనున్నది, మీరిఁక పెండ్లిచేసికొనుఁడు" అనెను.

'కుంచాలవారి కూనమ్మను చేసికొనవలసిన దనియేనా మీ యాజ్ఞ?'

'సరిలెండు! నన్ను 'మీరు మీరు' అనియందురేమి? కుంచాలవారిపిల్ల కూనమ్మయా? బంగారు గుఱ్ఱమువలె నున్నది. కట్నములా కఱవుతీరునంత.'

ఈ మాటలు వినుచున్న సుబ్బారావుముఖము ఏ దేశమునకో పోయినటు లుండెను. విచిత్రమయిన వదనభంగితో నతఁడిటులనెను – 'చూడా! నన్ను కుంచాలపిల్లను చేసికొనుమందువా? చేసికొనుమందువా?'

ఆ ముఖభంగిని, ఆ స్వరమును వినుచున్న చూడమ్మ కనులు ముకుళితములు కాఁదొడఁగెను. ఆమె 'చేసికొనుఁడు' అని చెప్పఁదలఁచుకొనెను. గాని ఆ కంఠము

చెప్పనీయలేదు. ఆమె రివ్వున వంటియింటిలోనికి పోఁదలఁచి తలుపులకడ కరిగెను. సుబ్బారావు బారలు సాఁచి ద్వారమున కడ్డముగా నిలవఁబడి 'పోనీయను' అనెను. 'తెరవాటుట కొట్టుట యేడనేర్చితిరి?' అని చూడమ్మ యనఁగా 'మీకడనే' అని సుబ్బారావనెను. అపుడు వంటయింట సంధ్యావందనము ముగించుచున్న రామస్వామి 'అమ్మాయీ విస్తళ్లువేయుము' అని యెలుఁగెత్తి పలికెను. చూడమ్మ వంగి సుబ్బారావు చేతిక్రిందుగా తూనీఁగవలె రివ్వున నిర్గమించెను.

(ఘ)

వడ్డన సమాప్తిచేసి మడి గట్టుకొనియున్న కూఁతురుచేతికి నేతిగిన్నె యిచ్చి మాణిక్యము కంఠము సవరించుకొని యిటు లనెను : "నాయనా సుబ్బారావూ, మాకు చూడ ఒకటీ, నీవు ఒకటీ కాదు. కొడుకులేనిలోటు మాకు నిజంగాలేదు. నీ పెండ్లిముచ్చట నా మీఁదుగా జరుపనిస్తే కొడుకును కననందులకు ఉండే లోటు భర్తీ అవుతుంది."

సుబ్బారావు మోమెత్తి యొకతూరి మాణిక్యమును, ఒకతూరి చూడమ్మను జూచి మరల తలవంచుకొనెను. మాణిక్యము మరల నిటు లనెను: "ఉన్న సంబంధాలలో కుంచాలవారి సంబంధముకంటె గొప్పసంబంధము లేదు. ఆ పిల్లానీవూ కలిసివుంటే రంభానలకూబురులున్నట్లు ఉంటారు."

సుబ్బారావు చరాలున మోమెత్తి చూడమ్మను జూచెను ఆమెమొగ మెఱ్ఱఁ బాఱియుండెను.

"మాటాడవేమి?' అని మాణిక్యము ముదలకించెను.

మాటాడకేమి? ఇదిగో మాటాడుచున్నాను - 'నేయి' అని సుబ్బారావనెను. చూడమ్మ నేతిగిన్నెతో సుబ్బారావును సమీపించెను.

"గడుసుతనమునఁగా ఇల్లా ఉండాలి. పెండ్లిమాట అడుగఁగా 'నేయి' అని సమాధానమా? నేతిని కట్టుకుంటావా యేమి? సరేకాని యేమే చూడా, ఇంతమంది పెండ్లికూఁతుండ్లను చూస్తిమికదా, కుంచాలవారిపిల్ల వంటి పిల్ల మతికనఁబడునా? నీవు చెప్పు!" అని మాణిక్యమనెను.

"ఔను" అనుమాట పలువంకరలతో చూడమ్మ నాలుకచివరినుండి బయటఁ బడుటయు, ఆమెచేతిలోని నేతిగరిటె సుబ్బారావు విస్తరిలోఁ బడుటయు ఒకతూరియే జరిగిపోయెను.

మాణిక్యమునకును రామస్వామికిని దెలియకుండ సుబ్బారావా నేతిగరిటెను ముద్దుపెట్టుకొనెను. చూడమ్మచేయి పులకలెత్తెను.

మాణిక్య మిటులనెను: "ఏమయ్యా సుబ్బారావూ మాటాడవు?"

"మాటాడ కేమమ్మా విను! ఆఁడవారు పసందుచేసిన పిల్ల మగవారికెటులు నచ్చును? ఆఁడవారి కాఁడవారందఱునూ బాగానే కానుపింతురు. మగవారికి మగవారందఱును బాగానే కానుపింతురు. ఆఁడది మగవానిని పసందు చేయవలయును; మగవాఁడు ఆఁడవానిని పసందు చేయవలయును. ఏమందువు?" అని సుబ్బారావనెను.

"అలాగా ఇదో కొత్తమాట. ఇంగ్లీషు చదువులలో ఉన్నది కాఁబోలు. పోనీ, నీ మాటే ఖాయం. మగవాళ్ల చేతనే పసందు చేయిద్దాము. ఏమండీ! మీరు చెప్పండి – కుంచాలవారిపిల్ల బాగుండునా బాగుండదా?" అని మాణిక్యము మగనివంక తిరిగెను.

రామస్వామి యిటులనెను .– "నా కనులకు బంగారముగనే యున్నది కాని సుబ్బారావు కనులు ఏమిచెప్పునో!"

చూడమ్మ హృదయము తపతప కొట్టుకొనియెను. ఆమె తలుపుచాటున నిలుచుండి సుబ్బారావుముఖము నుండి ఏమిమాటలు వినఁబడునో యని దిగులు పడుచుండెను.

సుబ్బారావు చూడమ్మ మొగము చూచెను. వెలవెలబారిన యామెమొగము శూన్యాకాశమువలె నుండెను. అందుకు లోలోన మురియుచు సుబ్బారావు ఇటులనెను : "మామగారూ, ఎందుకింత డొంక తిరుగుడు? నేను బి.యే. ప్యాసుకానిది పెండ్లి చేసికొనను."

చూడమ్మ ముఖాకాశమున విదియనాఁటి చంద్రకళ కానవచ్చెను.

మాణిక్య మిటులనెను: "ఈ కాలపు కుర్రవాళ్లందఱికినీ ఇదో ఫేషన్. మంచి సంబంధాలన్నీ పోగొట్టుకొని తరువాత తరువాత మాకు దాంపత్య సుఖము లేదని అఘోరించడమే కాక అందఱితో చెప్పుకోవడంగూడా ఒక ఫేషన్. నాయనా సుబ్బారావూ, నీవు అందరి వంటివాఁడవు కావు. నామాట విను. ఈ సంబంధం పోనీకు! తరువాత పస్తాయిస్తావు."

సుబ్బారావు చూడమ్మ ముఖము జూచుచు నిట్లులనెను – "అత్తా, అంతపట్టు పట్టకు. బి.యే., ప్యాసు కానిదే పెండ్లిచేసికొనననని నేను లోఁగడనే ఒట్టు పెట్టుకొంటిని. ఒకవేళ కుంచాలవారిపిల్లయే వ్రాసిపెట్టియున్నను అప్పటికి పాసిపోదు. ఇపుడా పిల్లకు పదియేండ్లేకదా!"

"ఎంత ఒట్టు పెట్టుకొంటివి? ఒట్టూ లేదు పిట్టూలేదు. తెలిసి తెలియని ఒట్లకు విలువేమిటి?" అని మాణిక్యమనెను.

"అటులనకు. ఒట్టు ఒట్టే" అని సుబ్బారావుఅనెను.

రామస్వామి యిటు లనెను – "ఒట్టు పెట్టు కొనఁదగునా కూడదా అను విచారము ముందే ఉండ వలయును. పెట్టుకొనిన తరువాత ఒట్టు ఒట్టే."

మాణిక్య మిటులనెను : "మీరూ బాగానే చెప్పారు." తలుపుచాటున దీర్ఘనిశ్వాస మొకటి బయలుదేరి భూమిని స్పృశించెను.

(జ)

సుమారు రెన్నెలలు గడచెను. బంధుగులయింట మడివంట చేయుటకు ప్రార్థింపఁ బడి మాణిక్యము వెళ్లెను. నేఁటి కామె రాదు. కావున చూడమ్మ యంతయు సుబ్బారావు మనస్సై కూరుచుండెను. అంత ఆ గదిలోనికి సాధికారముగాఁ బ్రవేశించి తపాలా వాఁడు ఒక కట్టను బల్లమీఁద టప్పునఁ బడవయిచెను.

'అబ్బ!' అని చూడమ్మ తలయెత్తిచూచెను. తపాలావాఁడు అంతలో 'సెలవు' అని వెళ్లిపోయెను. చూడమ్మ పేపరు విప్పిచూచెను. పేపరంతయు అంకెలే.

చూడమ్మకు సుబ్బారావునంబరు తెలియును. వెంటనే ఆ నంబరు కనఁబడెను. ఆమె తన సంతోషమును పైకి ఉబుకనీయఁదలఁచుకొనలేదు గాని వెంటనే ఆ పేపరు తండ్రికడకుఁ దీసికొనివెళ్లి "సుబ్బారావు బావ ప్యాసయినాఁడు" అనెను.

'అగును. అతఁడు ప్యాసగును' అని రామస్వామి కొంచె మాలోచించుచు 'అతనికొక మంచి పారితోషిక మిచ్చిరమ్ము' అని ఆదేశించెను. ఈ మాట వినినంతనే చూడమ్మ హృదయము జలదరించి వెనువెంటనే పులకించెను.

చూడమ్మ మరల తనగదిలోని కరిగి పారితోషికమున కాలోచించుచుఁ గూరుచుండెను. ఏ పారితోషికముమీఁదను ఆమెకు పాలుపోలేదు.

"ప్రేమ కేది యొసఁగినచో పారితోషిక మనిపించుకొనును? ప్రేమకుఁదగిన పారితోషిక మీ విశ్వముననే వస్తువు కలదు? ప్రేమకు తూఁగున దొక్క ప్రేమయే. రెండవ తక్కెడలో నీ బ్రహ్మాండములనన్నిటిని బెట్టి తూఁచినను మొదటితక్కెడ చలింపదు" అని యిటు లామె తలపోయుచుండఁగా రామస్వామి మెలమెల్లగా వచ్చి 'ఏమమ్మ, ఏమిపారితోషిక మిచ్చి వచ్చితివి?' అనెను. చూడమ్మ తెల్లఁబోయి 'ఏమియును లేదు' అనెను.

'అది యేమి? చీకటి పడినది. నీ కేమికావలయునో చెప్పుము, తీసికొని వత్తును' అని రామస్వామి యనెను.

'పారితోషికమునకు దగినదీ ప్రపంచమున నాకేదియుఁ గానరాలేదు.'



కథా నిలయం
శ్రీకాకుళం

రామస్వామి కొంచె మాలోచించి "అగు నగు" నని రెండుమాఱు లుచ్చరించి "పిచ్చిదానా! ప్రేమతో నేది యిచ్చినను పారితోషికమే. పత్రము, పుష్పము, ఫలము, తోయము - ఇది యంతయు పారితోషికమే. తుదకొక నూలుపోగేని పారితోషికమే యగును" అనెను.

"నిక్కమే నాకు తోఁచలేదు. కొండంత దేవరకు కొండంత పత్రి యెవతె తేఁ గలదు?" అని చూడమ్మ యనెను.

"అగును ప్రొద్దుపోవుచున్నది. నీకే వస్తువు ఈవలయునని యున్నది?"

"నాకు వస్తువు నిస్సార మనుపించుచున్నది. అయినను ఒక పూవిచ్చి నా సంతోషమునే పారితోషికమొనరించి వత్తును.'

"మంచిది" అని రామస్వామి తన ఆఫీసు గదిలోనికి వెళ్లిపోఁగనే చూడమ్మ వేషభాషలచే క్రొత్తయై సుబ్బారావుమేడకు దారితీసెను. ఆ దారిలో ఎన్ని యెన్ని సంగతులు తన హృదయమున గుఱుతుచే చిగురెత్తెనో, ఆ దారిలో తా నెంతసేపు నడిచెనో దాని కంతులేదు. చూడమ్మ మేడయెక్కి గదివంక చూడఁగనే సుబ్బారావు లేచి 'స్వాగతము'; అనెను, ఆమాటచే చూడమ్మ యొడలు కంపించెను; నడక స్తంభించెను. 'ఎన్నాళ్ల కిచటికి వచ్చితివి అని సుబ్బారావెదురువచ్చి చేయి పట్టుకొని బలవంతముగా గదిలోనికిఁదీసి కొనిపోయెను. స్వేదబిందువులచే ఆమె మోము పుష్పించెను. ఆ చూడమ్మ తానచట బందియయి పోయినటులు భయపడెను.

'ఇచటనే మనపెండ్లి, గుఱుతున్నదా?' అని సుబ్బారావనెను. సిగ్గుచే ఆ రక్తమయిన మొగము వెంటనే చిరనగవున అవదాతము కాఁగా చూడమ్మ "అగును, ఇటునుండియే మాయమ్మ రెండు మొట్టి నన్ను జరజర లాగుకొనిపోయెను' 'అనెను.

"నాకన్న నీకే యెక్కుడు గుఱుతు ఉన్నటులున్నదే! సరికాని మీ యమ్మ అపుడు లాగుకొని పోఁగలిగెనుగాని యిపుడు లాగుకొనిపోఁజాలదు."

"అగును! ఇట్టివి ఆఁడవారికే యెక్కుడు గుఱుతు. దానికేమి? మీరు ప్యాసయినందులకు మా నాయనగారొక పారితోషిక మిచ్చి రమ్మని నన్నుఁ బంపిరి.

"వారికే తోఁచెనా?"

ఈ మాటకు ప్రత్యుత్తరము బడయక సుబ్బారావు "ఏమి పారితోషికము తెచ్చితివి?" అని యడిగెను.

"తగిన పారితోషికమేదియు నాకుఁ గానరాలేదు. చేతులూఁపుకొనుచు నేనే వచ్చితిని." "భేష్ నాకు నీవే పారితోషికమవు" అని సుబ్బారావు హఠాత్తుగా చూడమ్మను

చుంబించెను. ఆమె గండ స్థలమంతయు గులాబీ పూలగుత్తియాయెను. అంత నామె పోవఁ బ్రయత్నింపఁగా సుబ్బారావడ్డు దగిలెను.

"మీ రింతగా నిరోధించుచుంటిరే; నాకు మీ రేమి పారితోషిక మీఁగలరు?"

"నీకు నేను; నాకు నీవు.'

"నిక్కముగా?"

"నిక్కముగా."

"ముమ్మాటికి?"

"ముమ్మాటికి."

"నేను విధవ నని మీరు మఱచియుందురు."

చూడమ్మ యిటు లనఁగనే సుబ్బారావామె ప్రక్క నిలువఁబడి యామె బుజము మీఁద బుజము వయిచి "ఇపుడో?" అని యనెను.

తలవని తలంపుగా సుబ్బారావు బాహువు తన మీఁదఁబడుటచే చూడమ్మ నిస్సారమగు నీ ప్రపంచము నంతముఁ గోలుపోయెను.

మన్మథుఁడు సమ్మోహనాస్త్రమును వేయుననుచుందురు. సుబ్బారావు బాహుపాశమును వేయనే వేసెను. బహుశా ఈరెండును ఆమె మీఁదఁ బ్రయోగింపఁ బడియుండును ఏలనఁగా సుబ్బారావా గది తలుపులు వేయుట చూడమ్మ కిసుమంతయుఁ దెలియదు.

## 3

### (క)

నిమేషమనియు, కాష్ఠయనియు, కల యనియు క్షణ మనియు నీ రీతిగా కాలజ్ఞులు కాలమున విభజించి చూపిరి. కాని ప్రేమ యొకటి వచ్చిపడి యీ విభాగమును తాఱుమాఱు చేసివయిచుచున్నది. అనురక్తుల కాలమానమునందు యుగ మొక నిమేషము. వియుక్తుల కాలమానమునందు నిమేష మొకయుగము. ఈ వియుక్తులు స్వవిషయమున సగుణబ్రహ్మగారి కాలమానము లోనివారు.

కాలమంతవడిగాఁ బరుగెత్తు గుఱ్ఱ మింకొకటి చూడమ్మసుబ్బారావులకు కానిపింపలేదు. సుబ్బారావుకు సెలవులలో శేషించిన నిరువదిరోజులే. ఈ యిరువది రోజులును ఇట్టే మాయమయిపోవును. పిమ్మట వారికి కానిపించునది శూన్యము.

నడుమనడుమ చూడమ్మ తాను సుఖము చూరగొనెనని మురియుచుండెను. ఆమె యుపాధ్యాయుల యుద్దేశముమాత్రము వేరు. ఏలయనఁగా అమె తనపాఠములయెడ

శ్రద్ధ చూపుటలేదు. రేపురేపులతో ఆమె జరిపిళ్లుపెట్టుచుండెను. కావున శరీరమున సుఖము లేదని వారనుకొనిరి.

ఇట్టి సుఖాసుఖములతో మొత్తముమీఁద సుఖము తోడనే వారియిరువురకు అయిరువది రోజులును దీర్ఘమయిన ఒక పగలుగా గడఁచిపోయెను.

సుబ్బారావు–ఉపయోగమునకుఁగాను ప్రాంతచింతకాయపచ్చడియు, నిమ్మకాయ బద్దయు, దబ్బకాయ బద్దయు మాణిక్యము జాడీలలో భద్రపఱిచెను. ఆ ఆసరా చూచుకొని చూడమ్మ ఆవకాయయు, మాగాయయు, మెంతికాయయు జాగ్రత్తపఱిచెను. వేలువిడిచిన మేనమామ వేంకటేశ్వర్లు సుబ్బారావు వస్త్రములను ట్రంకుపెట్టెలలో సర్దిపెట్టెను.

రాత్రి మేలుబండికి అతని పయనము నిర్ధారిత మాయెను. మిత్రులు కొందఱతనికి సుఖప్రయాణమాసించి చనిరి. 'ఈ పయన మీ రోజునకయినను ఆఁగిపోయినచో బాగుండి పోవు'నని తలఁచువారిలోనొకతె యగు చూడమ్మకడకు రామస్వామి వచ్చి 'అమ్మా! ఈ రెండువందల రూపాయలనోట్లు, ఈచిల్లర బావకిచ్చి రైలుకు పంపిరమ్ము' అని చెప్పెను. వెలవెలఁబోయిన మోమును చూడమ్మ వెంటనే సరిచేసికొనెను. తండ్రి చేతినుండి మెల్లగా ఆ కాకితములను దీసికొని బల్లమీఁదఁబెట్టెను. రామస్వామి వెళ్లిన కొంతసేపటికి బయలుదేఱి అటిటుచూచి సుబ్బారావుకడ కేగెను.

సుబ్బారావు ద్వారశాఖలకు రెండుచేతులు నానించి నిలువఁబడియుండెను. అతని చూపులు చక్రనాళమున కావలఁ బడుచుండెను. కనిపించినను కనిపింపకున్నను అతఁడు కాంచునది శూన్యము. ఆ శూన్యమును నిత్యకల్యాణము పచ్చతోరణముగా మార్చుచు నతనియెదుట చూడమ్మ యావిర్భవించెను. సుబ్బారావామెను తనలో నైక్యము చేసికొనుటకో, లేక తానే ఆమెలో నైక్యమగుటకో రివ్వున ముందరికి పరుగిడెను. చప్పున చూడమ్మ తప్పుకొనెను. అతఁడు నిలువఁబడెను. ఆమె అతని పాదములమీఁద వ్రాలెను. చూడమ్మ ముఖము సుబ్బారావు పాదములమీఁద నుండెను. తనపాదములు తడిసిపోవు చున్నటులు అతనికిఁ దెలిసెను. తెలియఁగనే అతఁడు – 'ఎందులకీ యకాలవర్షము? పాదములందు గంగను పుట్టించి నన్ను శ్రీమహావిష్ణువును చేయఁదలఁచితివా?' అని యనెను.

ధ్వని లేకుండ గంగాప్రవాహ ముప్పొంగు చుండెను. సుబ్బారావు వంగి యామెను లేవఁదీసి బాహువులలో బంధింప నుద్యోగించెను. ఆమె తప్పుకొని మొగము త్రిప్పుకొనెను.

సుబ్బారావిటులనెను – 'ప్రయాణము మానివైచెదను'.

'వలదు. నాకోర్కి అదికాదు.'

'మఱి యేది?'

'మన పెండ్లికి సుముహూర్త మెపుడు?'

సుబ్బారావీమాటకు డంగుపోయెను. ఏల యనఁగా 'బి.యే. ప్యాసుకానిది పెండ్లాడనని ఒట్టిడుకొంటి'నని లోఁగడ తాఁజెప్పినమాట కల్లమాట. కాని నది యిపుడతనికి వెంటనే తోఁపలేదు. కావున నేమియు తోఁచక అతఁడు దిక్కులు చూచుచు నిలువఁబడెను.

'వినఁబడలేదా?' అని చూడమ్మ ఖంగున పలికెను. సుబ్బారావపుడిటులు పలకకూర్చుకొని – వినఁబడకేమి? నీతలిదండ్రులు లంగీకరించుచో నాయడ్డేమి? 'ఊరి కుంకుమ, ఊరి పసుపు; ఊఁగు దేవరా యనినచో ఊఁగకేమి?' అని యనెను.

ఈ సామెతకు చూడమ్మ మొగము చిట్లెను. వెంటనే శాంతపడి 'నాతలిదండ్రు లంగీకరింపనిచో?' అని యామె ప్రశ్న వైచెను.

'వారు నన్ను పెంచిరి. ఈ మాట గుఱుతు ఉంచుకొనుము. మఱియు ఒకటి మఱచితిని. బి.యే. దాఁటనిది పెండ్లిచేసికొనననని ఒట్టిడుకొంటిని. కావున అది నేఁటి మాట కాదు.'

'నాఁటి మాటయే.'

'నాఁటికి నేఁడు బజానాయేల? అంతగా వలయునెడల నేనే తాకట్టు. ఉండు మందువా ఉందును; పొమ్మందువా పోదును. నీవు వత్తువా యేనుఁగెక్కి 'నటులు సంతసింతును.'

చూడమ్మ యేకాగ్రతను భంగించుచు వాకిట నున్న మోటారుకారు కఱచునటు లఱచెను. చూడమ్మ ఉలికిపడెను. సుబ్బారావు నవ్వి యామె నాలింగనము చేసికొనెను.

'మంచిది రైలువేళ అయినది. నాయనగారీ రెండువందల పయిచిలుకు మీ కిమ్మనిరి' అని చూడమ్మ రెండునోట్లను, కొంతపైకమును సుబ్బారావు జేబునఁ బడవయిచెను.

చూడమ్మ లేఁజెక్కులమీఁద సుబ్బారావు ప్రణయచిహ్నములు పడెను. చూడమ్మయు రాఁబోవు వియోగమునకు తగినంత పాథేయ మాతిథేయముగా నొసఁగెను.

(ఖ)

"ఏమండీ, పెండ్లిచేసి విడిస్తే మనభారం పోతుందికదా, అతనిభారమంతా మోస్తూవున్న మీరే పట్టనట్లు ఇల్లా ఊరుకుంటే ఎల్లా?" అని మాణిక్యమనెను.

"అవును. నేనూ అనుకుంటూనే వున్నాను. ఇపుడతనికి వస్తూన్న సంబంధాలకా అంతూ పొంతూలేదు. నీవు చేసే ప్రోత్సాహానికికూడా మితీమేరా లేదు. కాని అతగాఁడు బి.యే. మీఁద చూపెట్టుకుని కూచున్నాఁడాయిరి" అని రామస్వామి అనెను.

"అదుగో మీరుగూడా అల్లా అంటారే? లోకులేమంటారు? లోకులదాఁకా యెందుకు? మనకు మాత్రం తోఁచడంలా? అతని తలిదండ్రులే ఉంటే, ఉపేక్షిస్తారా? మన అమ్మాయిని అతని కిద్దామని మీరంటే నేనే కంకపట్టుపట్టి చెడఁగొట్టి చేతులారా వైధవ్యం కొనుక్కొచ్చాను."

"ఆ మాట నిజమే. ఎంతయినా మనం తలిదండ్రులం కాముగదా! ఈ కాలం వారందతికీ బి.యే పిచ్చి. ఇది పోందే పెండ్లాడరు. పెళ్లిచేసుకోమని పట్టుపటితే మనకే శత్రువులయి కూచుంటారు. పిదప పట్టపగ్గాలు ఉండవు."

"ఈ మాటలన్నీ నిజమే. అతనిభారం మనమీఁద ఉండఁబట్టి మనం లోకానికి జంకాలె. ఆ కుంచాలవారూ, మంచాలవారూ మనమీఁదపడి యేడుస్తారు. వాళ్ల కీ సంగతులేమి తెలుస్తవి? పోనీండి. అతను పెద్దవాఁడయినాఁడుకదా! అతనిడబ్బూ, అతని వ్యవహారమూ అతని కప్పగించెయ్యండి. దానితో మన పూచీ తొలఁగిపోతుంది.'

"తొలఁగించుకోడానికి మూడుచిటికెలు పట్టదు. సరికాని బి.యే ప్యాసుకానిదే పెండ్లాడనని అతఁడు పట్టుపట్టడానికి హేతువేమిటో నీవు కనిపెట్టావా?"

"అందులో ఏమంత అర్థం ఉంది?"

రామస్వామి తన భార్య తెలివిమాలినతనమునకు వగచి యూరకుండెనుగాని మాణిక్యము ఊరకుండనిచ్చు మనిషికాదు. 'దాని హేతువేమిటి, దాని హేతువేమిటి? కొంచెం చెప్పండి, కొంచెంచెప్పండి' అని మాణిక్యం రామస్వామి వెంటఁబడెను. రామస్వామి తట్టుకొనలేక యిటులనెను : నిన్ను నేనొకటి అడుగుతా. ఇది శాంతంగా ఆలోచింపఁ దగిన విషయం. ఇష్టం ఉంటే ఇయ్యకోవచ్చు, లేకుంటే లేదనవచ్చు. అంతేకాని కయ్యానికి దిగరాదు.'

'ఎంతమాటన్నా రెంతమాటన్నారు? కయ్యానికి దిగుతానా? అందులో మీతోనా? మీరు మొటితే మీవేలు ముద్దెట్టుకుంటాను.'

'అడవిజంతువులను పెంచినా కొన్ని మనిషిని నమ్మవు. దగ్గఱకు రానీయవు, అవి రావు. అందుకని వాటితో ఎప్పుడూ భయమే.'

'అమ్మా చూచారా? నన్ను పందినిగాను, పిల్లినిగానూ వెక్కిరిస్తారా? పోనీండి! మీ కనిపెట్టటాలు నాకేమీ అక్కఱలేదులెండి.

'చూచితివా? ఈ కాస్తకే శాంతిని కోలుపోతివే! తొందరపడి అసలుసంగతే అనేసి వుంటే చెవులే మెలిపెట్టేదానవో, విడాకులే ఇచ్చేదానవోకదా!'

'ఇంక మీరాసంగతి చెప్పకపోతే చెవులూ మెలేస్తాను, విడాకులూ ఇస్తాను'.

'అయితే విను. మనబస్తీలో అనేకమంది రెండోపెళ్లి చేసుకుంటున్నారు. నీ కళ్లముందు ఒకవంద అయివుంటవికదా! వీట్లనుగురించి నీవుద్దేశం ఏమిటి?'

'ఇదా? ఏమిటో ఏమిటో అనుకున్నాను. నాకు మొదట విడ్డూరంగానే వుంది. ఇపుడిపుడు పరిసిపోయింది. నిజం చెపితే ఏమనుకుంటారో గాని చూడను గూడా ఏ మహానుభావుఁడయినా చేసుకుంటాఁడేమో అని వుంది. తీరా పెళ్లిచేస్తే వెలివేస్తారనే భయమూ వుంది. నిజంగా చెయ్యడం ఒకయెత్తు; వెలిపడడం ఒక యెత్తు.'

'మనము ఎప్పుడూ అట్టిదానిని తలపెట్టఁ గూడదు. పెండ్లిగాని, చావుగాని ఒకేమాటు.'

'ఈమాటలు వేదాంతాలుగాని సంసారాలుగావు. చేసేవి సంసారాలున్నూ, చెప్పేవి వేదాంతాలున్నూ నాకు పనికిరావు. మీరు నన్ను విడిచిపెట్టినా సరేకాని నిజం చెప్తాను. 'నామనస్సు ఎన్నోసార్లు చలించింది. మీ మనస్సు ఎప్పుడూ చలించలా? నిజం చెప్పండి.'

'మనసంగతులు తరువాత మాటాడుకుందాము.'

'అలా అయితే విధవాసభవారికి వేయిరూపాయిలు మీరెందు కిచ్చారు?'

'రాధాగుప్త ఊరేఁగుతుంటే నీ వెందుకు తలుపులు మూశావు?'

'అది నాకు సరికొత్త. తరువాత తరువాత తెలిసి వచ్చింది. మొదట పాతక మనిపించింది. ఇపుడు పుణ్యమనిపిస్తూంది. ఈ విధవపసికాయలను చూస్తూవుంటే, అందులో మనపిల్లని చూస్తూవుంటే చెయ్యకపోవడమే పైగా పాతకమని తోస్తూంది. ఇది నామాట. మీరు వేయిరూపాయ లెందుకిచ్చారో చెప్పండి!'

'మంచిదని తోఁచియే అప్పుడిచ్చాను. ఇపుడు నాకదీ చెడ్డదిగా తోస్తూంది.'

'ఇంట్లో పిల్లని పెట్టుకోనికూడానా?'

'అవును ధర్మము పరీక్ష చేస్తుంది. అపుడే మనము నిలఁబడాలి.'

'విడాకులిస్తే నేను బతకలేను. చెప్పేస్తాను గాని చల్లగా విచారిస్తావా?

'అదిగో రెడ్డొచ్చె మొదలాడి.'

'నేనూ ఈ మాటే అంటాను. ఎవరి ఆచారం వారికి ధర్మం. ఈ పరీక్షకే నిలఁ బడాలి.

'మన అమ్మాయికి పెండ్లిచేయమంటావా యేమిటి?'

'మహారాజల్లే. ఇపుడు వెలివేసినా భయంలేదు. వెలికుటుంబాలు వేయికి పైఁగా ఉన్నవి. వీళ్లే మనకు చుట్టాలవుతారు.'

'ఒకవేళ సుబ్బారావే చేసుకుంటాఁడేమో?'

'అయితే ఇహలేందేవిటి? అతఁడు నాతప్పుదిద్ది పెట్టాఁడన్నమాట.'

'చూడ అభిప్రాయం ఎల్లావుందో?'

'ఎన్నఁడును మీ అభిప్రాయమునకు వేరుగా ఉండదు' అనుచు చూడమ్మ తలిదండ్రులకడకు వచ్చెను.

'తథాస్తు' అని మాణిక్యమనెను. 'దేనిని గుఱించి నాయభిప్రాయమునకు శంకించుచున్నారు?' అని చూడమ్మ ప్రశ్నింపఁగా 'ఏమియు లేదేమియు లే' దని రామస్వామి వెళ్లిపోయెను. పిదప చూడమ్మ తల్లిని ప్రశ్నించెను. ఆమెయు సమాధానము చెప్పలేదు. చూడమ్మ మరలమరలఁ బ్రశ్నించియు మాణిక్యముకడ ప్రత్యుత్తరమును పడయఁ జాలకపోయెను.

(గ)

గోడమీఁద వ్రేలాడుచున్న చింపుడు కాలెండరు తీసికొని చూడమ్మ రమారమి ఎనుబది కాకితములు చింపి వయిచెను. రెండురోజు లామె పళ్లబిగువుమీఁదఁ గూరుచుండెను. మూఁడవనాఁడామెకు భావజ్వర మంకురించెను.

దైనందినమామె యొకలేఖ వ్రాసి దాఁచికొనుచుండెను. ముక్తాహారము చేతఁ బూని రాత్రులందు సుబ్బారావుజపము చేయుచుండెను. ఆమె శరీరము శుష్కించెను. లావణ్యకాంతి యినుమడించెను.

ఇటులు పదిదినములు గడఁచెను. చూడమ్మ లజ్జను జయించి టపాలోవేయుటకు ఒకయుత్తర మిటులు రచించెను : "వెంటనేవచ్చి చూచి పొందని వ్రాయుటకంటె మఱేమియు వ్రాయఁజాలను."

టపాలో పడఁబోయియు ఈ యుత్తరము రెండు మూఁడు తడవలు జంకి చేతిలోనే నిలిచిపోయెను. జంకుపుట్టిన పిదప నన్నింటికిని కలుగునవస్థయే ఆ యుత్తరమునకును కలిగెను. పిదప శాశ్వతముగా అది చూడమ్మ పెట్టెలో చోటు చూచుకొనెను.

చూడమ్మ కించుమించు మతిపోయెను. ఒకప్పుడేమియును చేయదు. ఒకప్పుడేమియో చేయఁబోయి మానును. ఎవరయినను తనతో మాటలాడవచ్చినచో రెండు మాట లయినతరువాత మూఁడవమాటకు ముఖము చిట్లించుకొనును. ఆమెకు శరీరము బరువాయెను. నిద్ర మఱచిపోయెను. కల వచ్చినచో బాగుండుననుకొనెను.

లోఁగడలేని యాక్రొత్త వింతల ననుభవించి యనుభవించి చూడమ్మ తన యాత్మను సాక్షిగా నియమించి యీ మనోలీలను చూడ నభ్యాసము చేయఁదొడఁగెను.

ఇటులు గడుచుచుండఁగా సుబ్బారావుకడనుండి చూడమ్మ కొకయుత్తరము వచ్చెను: "నే నిక్కడ మీ నాయనగార్ని స్టేట్ ఖయిదీని. వాయుభక్షణకోసం రోజూ ఒకసారి కాలేజీకి తీసుకోవెళ్లి మళ్లీ ఖయిదులోకి తీసుకోవస్తున్నటులు కనఁబడుతూంది.

– నీవు గనుక రమ్మనిరాస్తే పరీక్షలు గిరీక్షలూ అవతలపారేసి బందీఖానాగోడలు దూకి నీశయ్యమీఁద వాలతాను. ఏమంటావ్? 'ఏమంటావ్?' అని రాస్తే 'వచ్చివాల మంటావని నాకు తెలుసు. అయినా ఏమి రాస్తావో చూడాలని చాలాచాలా లోభంగా వుంది."

చూడమ్మ ఈ యుత్తరమును తత్తఱముతోఁ జదివి కొని పుస్తకములో దాఁచికొనెను. ఇటులు దాఁచి కొని గది వెలుపలికివచ్చి నలుదెసలును పరికించెను. పరికించి లోని కేగి మరలఁ జదివి ఆ యుత్తరమునందలి వాక్యము లన్నియు కంఠస్థలములయిపోయినను ఆమె యాచీటిని పలుమాఱులు చదివికొనెను. ఆ యక్కరములు సుబ్బారావుకు ప్రతిబింబములా, లేక అతనిని చూపఁగల దుర్భిణియంత్రములా?

చూడమ్మ యిటులు చదివిచదివి చూచిచూచి లెస్సగా నాలోచించెను. ఏకాగ్రముగా నాలోచించినపిదప దానినిటులు క్రియారూపము కావించెను :

"నేనే రాఁదలఁచియుండఁగా నింతలో మీరేవచ్చి వాలుదుమని వ్రాసితిరి. మనమేకాక మనయభిప్రాయములుగూడ నొక్కటగుటవలన నాకు ఆనందోద్రేకము కలిగెను. నాతోపాటు మీరును ఈయానందమును పంచుకొందురుగాక! కాని మన మీ యానందమును ఇపుడు మనసులోననుభవింపవలసియే యున్నది. ఏలయనఁగా మన యిరుగుపొరుగువారు మంచివారు కారు. విశేషించి మా తలిదండ్రులు. పెండ్లిచేసికొనవలసి యుండఁగా మన మిటులు రహస్యముగా తొందరపడఁగూడదు. ఈ మాటలు పరుషములని నేనెఱుఁగుదును. మీచూడ బాల్యమునుండియు పరుషభాషిణియని మీరెఱుఁ గుదురు. కావున క్షమింపఁగలరు. మీ సెలవుదినము వడిగా వచ్చుటకు సూర్యచంద్రులను ప్రార్థించుచున్నాను."

చూడమ్మ యీయుత్తరమును టపాలో పడేవేసేనేకాని వేసిన మఱునిముషము నుండియు ఏడ్చుచునే కూరుచుండెను. 'లోకులు కాకులు. ప్రేమయొక్క యోగ్యతా యోగ్యతలను నిర్ణయించుటకు వీరి కేమి యధికారము? వీరు దానికి ముందజ యెట్లు వేయఁగలరు. 'Fools rush where angels fear to tread' అని అనుకొనుచు చూడమ్మ లోలోపలనే కుమిలిపోయెను.

ఇటు లామె వియోగతపము చేయుచుండఁగా నొకనాఁడు తాను చింపివేసిన క్యాలెండరుమీఁది అంకె గల తేదీ వచ్చెను. ఆ మఱునాఁ డామె కెక్కడలేని సంతోషమును వచ్చెను.

(ఘ)

'నానోరు ఊరకుండఁజాలదు. నేను కథల కాణాచిని' అని సుబ్బారావనెను.

'నన్ను క్షమింపవలయును. మీరు మరల కాలేజీకి వెళ్లఁగానే మీమాటలు చెవులార ఆలకింపక పోతినే'యని దుఃఖింతును. కావున వేయిమోములతో మాటలాడుదు ' అని చూడమ్మ యనెను.

"నీవు 'పెండ్లి' యని వ్రాసితివి గుఱుతు కలదా'

'కలదు.'

'పెండ్లియను ఆచారము ప్రేమ కగౌరవము కాదా?'

'లెస్సగా విచారించినచో అది గౌరవము. సగుణము నారాధించినచో తత్త్వమున కెట్టి యగౌరవమో అట్టి యగౌరవమే యనినచో నా కిసుమంతయు ఆపత్తిలేదు.

'జంతువులు పెండ్లాడుచున్నవా?'

'మనము జంతువులము కాము'

సుబ్బారావు తల పంకించి యిటులనెను - 'ఆహార నిద్రాదులలో పశువులకును మనకును ఏమి భేదము?'

'ఆహారాదికర్మలలో భేదము లేదుకాని సంఘశ్రేయమునకు మానవుఁడు దాంపత్యధర్మమును సృజించుకొనెను. దాంపత్యము సంఘ సమిష్టిపురుషుని శిల్పము.'

సుబ్బారావుకు పైమాట తోఁచక యిటులనెను : ప్రేమ చంచల మగునా కాదా?'

'శిక్షితము కాని మనస్సు చంచలము. అందలి ప్రేమయు చంచలమే కావచ్చును. కాని దానిమాట నేనింకను స్ఫుటముగా చెప్పఁజాలను. కాని నే నిఁక దాని గుఱించి విచారింపను. దానితో నాక పనిలేదు.'

'పోనీ. నీ మాట వలదు. లోకముమాట?'

'ఎన్ని రకములు కావలసి యున్నచో అన్నిరకములును లోకమునఁగలవు. వాని కన్నిటికిని స్మృతులు పీనల్ కోడులు సాక్ష్యము.'

'సరియ. గురవమ్మగుప్త పునర్వివాహము చేసికొన్నది కదా! ఏడాది తిరుగక ముందే కలరా తగిలి అతఁడు చనిపోయెను. అతఁడు పోయిన నెలలోపుగనే ఆమె మరల పెండ్లాడెను. ఇట్టివార లెందఱో కలరు గదా! వీరి ప్రేమ చంచల మందువా యేమందువు?'

'చంచలము కాదని యెవరందురు?'

'ఈ గురవమ్మ పెండ్లిండ్లు నీకు సమ్మతములేనా?'

'ఆ గురవమ్మ కీ చూడమ్మ సమ్మతితో ఏటిపని?'

'ఆమెకు లేకపోవుఁగాక! మనలోమాట?'

'ఒకరి పెండ్లికిఁగాని, ప్రేమకుఁగాని 'మనలో మాటలు' ఉండవు. అచట ఇతరుల కధికారము లేదు. నోరు పాఱవైచుకొనువారికే అచట ప్రవేశము.'

'ఒకరికి తీపి యిష్టము. ఇంకొకరికి అనిష్టము. అట్టి ఇష్టానిష్టములు మనలో మనము చెప్పుకోఁగూడదా?'

'చెప్పుకొనవచ్చును గాని వీరి యిష్టానిష్టములవల్ల వారి తీపి ఉపాధేయతాను పాధేయతలఁ జెందదు. వారి తీపి వారిదే. వీరియిష్టము వీరిదే. వీరి యిష్టానిష్టములకు ఈమాత్రము ప్రామాణ్యమే యిచ్చినయెడల దాని గుఱించి మాటాడుటకు నాకు సంకోచములేదు.'

'మంచిది. ఇఁక మాటాడుము.'

'వినుఁడు! ఏఁడాది కాదుగదా ఒకనిమిషమేని కాఁపురముచేసిన యనుభవము నాకులేదు. అనుభవము లేని పుట్టువిధవ ఈయెడ నేమి చెప్పఁగలదు? అన్ని ఖండములందును, అన్ని దేశములందును ఓపిక ఉన్నంత వఱకు నిరాఘాటముగా పెండ్లిమీఁద పెండ్లి, పెండ్లి మీఁద పెండ్లి చేసికొనుచునే యున్నారు. ఆ చేసికొనిన వారే దానితత్త్వమును వెల్లడింపనర్హులు. అయినను అనధికారముగా ప్రవేశించి నా ఉద్దేశమును తెలుపవలసి వచ్చినచో 'అది నాకు అసమ్మతమే' అని మాత్రము దెలుపవలసి వచ్చును.'

'భేష్' అని సుబ్బారావు చూడమ్మవీపు తట్టి బలాత్కారముగా ముద్దిడుకొనెను.

'నాయుద్దేశము తప్పా?'

'కాదుకాదు' అని సుబ్బారావు బిగ్గరగా నవ్వఁదొడఁగెను. వీధిలో నేరికిని వినఁ బడకుండుటకు చూడమ్మ అతని నవ్వంతయు తన ఓష్ఠద్వయముచే అరికట్టెను.

(ఙ)

సెలవులు ముగిసి సుబ్బారావు కాలేజికి వెళ్లుటయు, కన్యకాపరమేశ్వరి పూజలు వచ్చుటయు తటస్థించెను.

కన్యక యేఁటేటను రామస్వామియింట షోడశోపచారములతో ఆతిథ్యము గొనుచుండెను. 'పై యేఁటిమాట యెటులుండునో' యని అనుకొనినదాని వలె అపుడు కన్యక తన విరాడ్రూపముతో నందఱకును దర్శనమిచ్చెను.

అచట వైశ్యులకును విప్రులకును విరోధములేక పోవుటచే బాపనసోమిదమ్ములు విజయం చేసిరి. పూచిన తంగేళ్లవంటి ముత్తయిదువులు ఈ రెండు కులములవారును కర్మజ్యేష్ఠత ననుసరించియు, కులాధిక్యమును పాటించియు, ధనాధిక్యమును చిన్న పుచ్చకయుఁ గూరుచుండిరి. ఈ ముత్తయిదువులందఱలో మగఁడులేని ముత్తయిదువు చూడమ్మయొకతెయే.

ఒకసోమిదమ్మయు, ఒకదీక్షితులును పౌరోహిత్యము నడపుచుండిరి. కన్యకా పరమేశ్వరి తనభక్తకోటిని కరుణించుచున్నటులు కానిపించుచు పూలతోడను కుంకుమతోడను కలకలలాడుచుండెను.

సభవారిలో గుసగుస లారంభమాయెను. 'తల్లి కంటె కూఁతురే ఎత్తరిగా ఉందే?' అని ఒక ముత్తయిదు వనెను.

'బ్రహ్మచర్యంలో ఉంది ఆ మహత్తు' అనియింకొక ముత్తయిదువు అనెను.

'మన్మథబ్రహ్మచర్యంలోనా?' అనియింకొకతె అనఁగనే నవ్వి మఱొకయామె 'చదువుకుంటూందిటే' అనెను.

'చదువుకోవడం యేమిటమ్మా? పెద్దశాస్తుల్లా, పేద్దరావూగూడా అయిపోయిందిట' అని యింకొక యామె యనెను.

'పాపం ఏమయితే యేం లాభం? వైధవ్య మషగా!' అని ఇంకొకతె యనెను.

'అదేమిషీ? ఆ మనిషిమీఁద వైధవ్యచిహ్నం ఏమయినా కనఁబడుతుందా?' అని మఱొకతె యనెను.

మాణిక్యము కుడిప్రక్కనున్న సోమిదమ్మలు చయనమ్మలు మొదలగు బాపన ముత్తయిదువలగుంపు నుండి మెలమెల్లగా ఈ మాటలు వెలువడెను : 'ఎంతెంతగా ఆత్మారివారి ఆచారమని అంగలు వేసినా కట్టుదిట్టాలన్నీ కదలిపోయినవమ్మా. ఆ వేష మేమిషి? నొష్టన ఆ కుంకు మేమిషి? ఆ నగ లేమిషి? ఆ చదువేమిషి?' అని ఒక సోమిదమ్మ ఒక చయనమ్మతో ననెను.

'మగఁడు లేని పిల్ల కాఁబట్టి రోజు కొకపెళ్లి చేసేట్టుంది మాణిక్యం' అని ఆ చయనమ్మ అనెను.

ఈ మాట లన్నియు మాణిక్యమునకు వినఁబడెనని ఒక దీక్షితమ్మ కనిపెట్టెను. తన కిపుడు మంచి సమయము దొరకెనని గ్రహించెను. గ్రహించి – 'ఈలాటి పుట్టురత్నాలకు చేస్తేనేం?' అనెను.

వెంటనే సోమిదమ్మ దీక్షితమ్మ మొగముమీఁద సమాధానము చెప్పవచ్చెను. గాని మాణిక్యము మొగము కనిపించుటచే వెనుకకు తగ్గెను. కర్మజ్యేష్ఠతవలనఁగలిగిన ఆధిపత్యము యొక్క మానమర్యాదలను కాపాడు కొనుటకు పితికికంద లేని చయనమ్మ మాత్రము కలుకుగనే జవాబుచెప్పఁగలిగియు చూడమ్మను జూచి కొంత తగ్గి 'అన్ని పిచ్చికళలూ మన బ్రాహ్మలలోనే ఉన్నయ్' అనెను.

'మీ అమ్మ మేనమామకూఁతురు విధవావివాహం చేసుకోని యెన్నాళ్లయింది?' అని దీక్షితమ్మ యనెను.

దీక్షితమ్మ యిటులనఁగనే చయనమ్మ జంయిమని లేచెను. చయనమ్మ జంయిమని లేవఁగనే దీక్షితమ్మ తెయ్యి మని యాడెను. వారిరువురును ఇటులు బుగ్గలు పొడుచుకొను చుండఁగా మాణిక్యము వారినడుమకు వచ్చెను.

'నేనంటే మీ అత్తగారు కాళ్లు కడిగి నెత్తిమీఁద చల్లుకునేది. నాకెన్నో దానాలు ముట్టఁజెప్పేది. అషువంటి నాతోటి లడాయివేసుకుంది యీదీక్షితమ్మ' అని ఆ చయనమ్మ మాణిక్యము ముందు మనవి చేసికొనెను.

'అసలు సంగతి చెప్పవేం? లేనిది పూసుకోవస్తే యేం మర్యాద? మాణిక్యమ్మక్క గారి యింట్లో మావారిది కాదూ ఆధ్వర్యం? ఇవ్వాళటిమటు క్కివ్వాళ మాణిక్యమ్మక్కగారు స్వయంగా వచ్చి మమ్మన్ని పిలిచారుకాదూ?' అని ఆ దీక్షితమ్మ ఆ చయనమ్మమీఁది కెగఁబడెను.

'ఇందులో వివాద మేముంది?' అని మాణిక్యమ్మ అనఁగనే దీక్షితమ్మయు, చయనమ్మయు 'ఆ! యేవుంది? వడ్లగింజలో బియ్యపుగింజ' అని యనిరి.

ఇంతలో దీక్షితులు లేచి - 'సహస్రశీర్షం దేవమ్' అని మంత్రపుష్ప మారంభించెను. దానితో ఈ పులులన్నియు లేళ్లయిపోయెను. అందఱును లేచి నిలువఁబడి ధ్యానముచే ఒకరయిపోయిరి.

పూజాశేషము పూర్తియయినతోడనే అందఱకును పసుపుకుంకుమలును, చందన తాంబూలములును ముట్టెను. ముత్తయిదువులందఱును ఇనుమడి సంభావనలతో నిండ్లకేఁగిరి.

దీక్షితమ్మ దిగ్విజయము చేసినటులు ముమ్మడిసరకుతో లేచెను. దాని కినుమడి సంభావనతో చయనమ్మ లేవలేక లేవలేక లేచెను. చయనమ్మ యిటులు వెళ్లుచుండఁగ మాణిక్య మామెకడ కరిగి - 'ఏమండో! ఈ పసుపూ ఈ కుంకుమా ఈ చీరా ఈ రవికా

మీ అమ్మ మేనమామగారి కూతురి కిప్పించండేం' అని చెప్పి చూదమ్మచేత వానినన్నిఁటిని ఆ చయనమ్మ చేతులలోఁ బెట్టించెను. చయనమ్మ వానిని గ్రహించుటకు మొదట కొంచెము సందేహించెను గాని చీరమీఁది జరీ కనఁబడఁగానే చేతులు జాఁపకుండఁ జాలక పోయెను.

## 4

### (క)

'మొన్నటిపూజలలో వచ్చిన ముత్తయిదువులందఱూ అమ్మాయినెత్తిమీఁద తలో అక్షింతలగింజా వేసిపోయినా'రని నీవు చెప్పిన దగ్గిఅనుంచీ అమ్మాయిని గుఱించి మనం చాలా జాగర్తపడాలని తోస్తూంది అని రామస్వామి అనెను.

మొగము చిట్లించుకొని పెదవిదాఁటకుండ నవ్వి మాణిక్యమిటులనెను – 'అవును, తొందరగా ముహూర్తం అయిందనిపించాలి.'

పుత్రికా పునర్వివాహమునకు మాణిక్య మంగీకరించునని మొదట రామస్వామి కలలోఁగూడ ననుకొనలేదు. ఆమె నంగీకరింపఁజేయుటకు విశ్వప్రయత్నము చేయవలసివచ్చునని అతఁడు భావించియుండెను. ఇట్టిస్థితిలో మాణిక్యమే ముందడుగు వేయుటచే ఆమె మనఃపరివర్తనమును తెలిసికొనుటకును, ఆమెమనోబలమును పరీక్షించుటకును అతనికి కుతకము కలిగెను. కలిగి యిటు లనెను. '–ఈ పెండ్లిముచ్చట అమ్మాయి దగ్గిఅనుంచి రావాలికాని మనదగ్గిఱ మొదలు కాఁగూడదు. ఇంకొకటి పెండ్లిమాట తలపెట్టకముందే ఈ ముత్తయిదువలు ఇట్లా దూసుకుంటున్నారు. ఇఁక చేసివేస్తే మనలను వెలివెయ్యరా?'

'అట్టిస్వాతంత్ర్యం అమ్మాయిలకూ అబ్బాయిలకూ ఇంకా మనం ఇవ్వలేదు. ఇది ప్రాచీనాచారాలకూ, నవీనాచారాలకూ యుద్ధసమయం. కొన్ని శతాబ్దాలు పడుతుంది ఈ యుద్ధం.

'మనస్సు చలించిం తరువాత ఆఁగదు. ఈ పెండ్లిముచ్చట అమ్మాయిలదగ్గఅనుంచే రావాలని మనం కూచుంటే వాళ్లపిల్లలకు బారసాలలే చేయవలసివస్తుంది.

'ఇఁక వెలి అంటారు. ఆ వెలికి స్వాగతం. ఆ వెలే సత్యజీవితానికి సరిహద్దవుతుంది.'

ఈ మాటలు విని రామస్వామి లోలోన 'చూదమ్మ వివాహకాలంనాఁటి మనిషియేనా యిది? నగలకు పోట్లాడిన వియ్యపురాలేనా యిది? దీనికి ఈ సంస్కారం కూఁతురు వైధవ్యం వలననేనా, మఱొక కారణము వలననా? ఈ పునర్వివాహానికీ దీని జీవితానికి వంతెన యేదో దాన్ని కనుక్కోవాలి' అని తలపోసి యిటులనెను – 'నా మనస్సు ఎన్నోసార్లు

చలించిందని వెనుక నీవంటివే, దానికీ దీనికీ ఏమయినా సంబంధం ఉంటే అది చెప్పఁ దగినదయితే –

మాట ముగియకముందే అందుకొని మాణిక్యమిటులనెను : 'అది మీతోఁగాక పోతే మఱియెవరితో చెప్పుకుంటాను? మీరు నన్ను చాలాసార్లు 'మంచిదానవు' మంచిదాన'వని ప్రశంసించారు. ఆ ప్రశంస ప్రతిమాటూ నా హృదయంమీఁద ఒక సుత్తిదెబ్బ వేసిపోయింది. 'జీర్ణ మన్నం ప్రశంసంతి భార్యాంచ గతియౌవనాం' అనేమాట నావిషయంలో నిజం.

'నామనస్సు ఎన్నోసార్లు చలించింది. అవును. నాశరీరం పునాసమామిడల్లే అకాలంలో వికసించింది. ఆ వికాసానికి లోపల ఎంతకాకఁ ఉన్నదో అది నాకే తెలుసు. ఆఁడదాని మనస్సు కొంచమయినా తెలియని మా వెర్రిబాగులనాయన నన్నప్పుడు అత్తవారింటికి పంపకపోయినాఁడు. ఆయన నన్ను కన్నవాఁడయినా ఈ రాయి ఆయ నెత్తిని వెయ్యక తప్పదు.'

మామగారి నెత్తిమీఁద రాళ్లింకను పడకుండుటకుఁగాను జోక్యముచేసికొని రామస్వామి 'మంచిది' అనెను. ఆ మంచిదితో దారికివచ్చి మాణిక్య మిటులు చెప్పఁ దొడఁగెను : –

'అపుడు మాకు బొంబాయిలో వర్తకం. కాఁపరం కొన్నాళ్లక్కడా, కొన్నాళ్లిక్కడా. చెన్నపట్నం మీఁదుగా దారి. మేమందఱమూ సెకండుక్లాసు బండిలో వెళుతున్నాము. వంగవోలులో మాబండిలోకి పద్దెనిమిదేండ్ల కుర్రవాఁడొకఁడు ఎక్కి కూచున్నాఁడు' అని చెప్పి మాణిక్యము మగనికేసి చూచెను.

ఆ మొగమునం దెచటను నేత్రసంకోచము గాని, బొమముడిగాని, పెదవివిఱుపుగాని లేదు. ఈనికి ఆమె అక్కజపడి యిటులనెను : 'సిగ్గులేని నామాటలు వినటానికి మీకు జుగుప్సగాని, క్రోధముగాని, నిర్వేదముగాని కలుగనిచో మెల్లగా మనవిచేసుకుంటాను.'

రామస్వామి నవ్వి యిటులనెను : 'నా కివేమీ కలుగలేదు, కలుగవు. మనస్తత్త్వాన్ని నీవు చెపుతున్నట్టుందిగాని నిన్ను గుఱించి చెప్పుకుంటున్నట్టు లేదు. కాఁబట్టి నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈమాటలు విని మాణిక్యము ఇటులనెను :– 'అటువంటి మొహం నే నెన్నఁడూ చూడలేదు. దాని ఆకర్షణవంటి ఆకర్షణ యమపాశాలకుఁగూడా లేదు.

'చంద్రునికేసి మన మందఱం చూస్తాం. చంద్రుఁడుకూడా మనలను చూచినట్లేవుంటాఁడు. కాని ఆ మొహం నన్ను చూడలేదు. నాకు అభిమానమూ, అహంకారమూ కలిగినవి.

'అట్టి సమయములో చిత్తజల్లులాగా అతని చూపులు ఒక్కసారి నామీఁదపడి వెనక్కి మళ్లినవి. నా అభిమాన – అహంకార – స్థానములలో కొంచెము సిగ్గూ (కొంచె మెందుకంటే నాకసలు సిగ్గులేదు), గర్వమూ చోటు చేసుకున్నవి.

'మళ్లా అతను నన్ను చూడాలనే గర్వంతోటి నేనతనిని చూడఁదలఁచుకోలేదు. కాని చూడకుండా ఉండఁగలిగే ధైర్యం పోయింది.

'చాంచల్యానికి అన్నీ దారులే. మా సెకండుక్లాసు బండిలోపల టాపు (Top) నడుమ అద్దమొకటి తాపటముచేయబడి ఉంది. ఆ అద్దములో అతని ప్రతిబింబము అక్షరాలా కనఁబడుతూ ఉంది. అతన్నీ, అతని ప్రతిబింబమునూ చూస్తూ కూచున్నాను. లోకం ఉన్న దనేమాట నేనెఱుఁగను. ఇట్లా చూస్తూఉండంగా ఉండంగా తలవెనుక టక్కుమని దెబ్బతగిలింది. మా అమ్మ కొట్టిందనుకున్నాను గాని చూస్తునుగదా కాదు. రైలుపెట్టె. స్టేషనువచ్చింది, రైలాఁగింది.

రైలుసాగింది. మళ్లా ఆ చంద్రుఁడు ఈ తారకమీఁద ఒక్కకిరణమైనా విసరలేదు. కేవలం నేనే కళ్లు తీసుకొన్నాను. ఆ మొహం ఎంతగంభీరం, ఎంత గంభీరం! అదో సముద్రం.

అతఁడు నన్నిల్లా ఏడిపించి యేడిపించి నా మొహం చూడకుండానే నెల్లూరులో దిగిపోయాడు.

'నా గర్వం కరఁగికరిఁగి ఎన్నేళ్లదాఁకానో కన్నులలోనీరుగా మాఱి జాఱిపోయింది. తుద కొకనాఁడు మీమొహం కనిపించిం తరువాత కూడా ఆ కళంకం పోలేదు. కాఁబట్టే అనుకుంటున్నాను – ఆ కాలంలో పుట్టిన ఈ చూడకుకూడా మనసు చలిస్తుందా, తల్లిచాఱు?' అని.

'కాఁపరాలు చేసేవాళ్ల మనస్సు లన్నీ ఇనుముతో చేయఁబడినవా మా మనస్సులు మాత్రం నీళ్లవంటి చంచలపదార్థంతో చేయఁబడినవి. మాజాతి వేఱు ; మేము వేఱూ అని అనిపిస్తూంది. ఈ పతితను చేసుకోఁబట్టి మీకు గూడా ఇందులోపాలు పంచుకోక తప్పదు.

'మీ మనస్సు ఎపుడూ చలించలా? నిజం చెప్పండి అని మిమ్ములను నేనొకసారి అనివున్నాను. అది పతితల నోళ్లల్లోంచి రాఁదగని మాటే. ఆ మాట అన్నందులకు మాత్రం క్షమించండి.

'ఇంతకుముందు చెప్పిన నా చాంచల్యానికి మీ క్షమాభిక్ష. వేఁడుకోను. ఎందుకంటే అది క్షమాపణకు విషయమే కాదు. ఒకవేళ అయితే అంతర్యామి ముందు నిలువఁబడి ఆ బిచ్చం అడగాలి' అని మాణిక్యము గడగడ వడఁకుచు స్తంభించిపోయెను.

మాణిక్యము హృదయము రామస్వామికి తెలిసెను. కాని ఆమె అంతర్యామి ముందే ఉన్నదో, లేక తన ముందే ఉన్నదో అతనికి చాలసేపటివఱకు తెలియలేదు. తనముందే ఉన్నదని రామస్వామికిఁ దెలియఁ బోవుముందు ఆమెకనులనుండి బాష్పములు ప్రవహించెను. ఆమె హృదయము తేలికయేయాయెనో, బరువే అయెనోకాని పిదప, మగనిముందు నిలువఁజాలక పోయెను. ఆమె పడకటింటిలోనికిఁ జని తలుపులు మూసికొనెను. అచట నామె యానందించుచున్నదో, దుఃఖించుచున్నదో రామస్వామికే యెఱుక!

(ఖ)

పిమ్మట పదినాళ్ళవఱకును తనమాటలకు ప్రత్యుత్తర మిదుటకు మాణిక్యము రామస్వామి కవకాశమొసఁగలేదు. తుట్టతుద కొకనాఁడవకాశము దొరికించుకొని రామస్వామి యిటులనెను :

"వినుటకు మాత్రమే అధికారమిచ్చి క్షమించుటకు సంబంధములేని నీ తాలూకు కొన్ని మాటలు చెప్పితివే అటువంటివిన్నీ, వాని తలదాఁటినవిన్నీ అయిన నా తాలూకు మాటలుగూడా కొన్ని ఉన్నవి. వాటితో నా పని ఉక్కిరిబిక్కిరి అవుతూంది."

ఈ యుపోద్ఘాతము విని 'నేను నా సంగతి వారికి విన్నవించినపుడు వారు సెలవిచ్చు మాటలను నిషేధించుటకు నాకు వీలుండదు' అని యనుకొని మాణిక్యము మాటాడ కూరకుండెను. రామస్వామి మాణిక్యము మౌనమునకు ఉత్సాహము బడసి యిటులు చెప్పఁదొడఁగెను:

"మనస్సు చంచలం అనేమాట మనకే కాదు, భగవంతునికికూడా బాగా తెలుసు. 'మనో దుర్నిగ్రహం చలం' అని ఆయన అర్జునుఁడికి ఒత్తా సిచ్చాఁడు. అయితే దానిని చంచలం కాకుండా చేసుకోవాలి. దానికి సంతతతాభ్యాసమున్నూ, వైరాగ్యమున్నూ మందని ఆయనే చెప్పాఁడు.

"ఇప్పుడుండే మనుష్యులందఱకూ వాళ్ల వాళ్ల సంకల్పాలు సమకూరేలాటి ఇష్టారాజ్యం ఒకటి సృజించి చూస్తే ఎవని పెండ్లాము వానిది కాదు, ఎవతె మగఁడూ దానివాఁడు కాఁడు. అంతా తాఱుమాఱు అయిపోతుంది. ఆకాశపాతాళాలు తలక్రిందులయిపోతవి. రహస్యంగా రగులుతున్న విరహాగ్నులన్నీ ఒక్కసారి చల్లాఱుతవి. వ్యభిచారం ఉజాడయిపోతుంది.

"ఆ యిష్టారాజ్యంలో అందగాళ్లూ, అందగత్తెలూ ఓవారంరోజులు ఏకపత్నీవ్రతాలూ, పాతివ్రత్యాలూ పరిపాలించవచ్చు. ఎంచేతంటే అదేపనిగా కూచుంటే ప్రేమకు అంతకంటె నిలుకు ఉండదు.

"వాళ్ల మాట లల్లావుండంగా అందంలేని మగాళ్లకూ ఆడాళ్లకూ బలాత్కార బ్రహ్మచర్యమే గతి కావలసి వస్తుంది. అందంలేని ఈ ఉభయులూ అందం గలవాళ్లను బతిమాలుకోకాతప్పదు; వాళ్లచేత అవమానం పొందకా తప్పదు.

"అందగాళ్లలోనూ అందకత్తెలలోనూ కూడా అందచందాలలో ఉండే తేడాచేతనో, మతీవాసన చేతనో కాని తా నొకతెను ప్రేమిస్తే అది తనను ప్రేమించదు; అది యొకనిని ప్రేమిస్తే వాఁడు దానిని ప్రేమించఁడు. అందువల్ల వాళ్లలోకూడా నవాబులల్లే చాలామంది పెళ్లాలుకల మగవాళ్లూ, ద్రౌపదులల్లే చాలామంది మగలు కల ఆడవాళ్లూ ఉంటారు. వీళ్లందఱకంటె ఎక్కువగా పెళ్లికానివాళ్ల జనాభా పెచ్చవుతుంది. ఇల్లాఉండంగా పెళ్లిచేసుకున్న దంపతులలోఁగూడా ఓ వారంరోజులలో విడాకులు పుట్టుకోవస్తవి. ఇటువంటి ఈ యిష్టారాజ్యం చూస్తే అరాచకం కంటె ఎక్కువ అని అనిపిస్తుంది.

"కాఁబట్టి ఈ చాంచల్యమును చంపివేయడమే మొదటి పక్షం. ఇది మహాత్ములకే చెల్లింది.

"ఒక నియమానికి లోఁబడి నిగ్రహించుకోవడం రెండోపక్షం. దీనిపేరే గార్హస్థ్యం. 'పెండ్లయినా చావయినా ఒకేమాటు' అని చెప్పే మనువంత గొప్ప వారికే ఇది చలామణీ అవుతుంది.

"చాంచల్యానికి లోఁబడి పోవడం మూఁడోపక్షం.పశువులతోటీ కీటాలతోటీ అట్టే తేడాలేని మనవంటి మానవకోటికి ఈపక్షం, ఇందులోకూడా ఒకనియమము ననుసరించి నిగ్రహం అవసరం గనుకనే పునర్వివాహం.

"చాంచల్యం మాత్రమే నీకు కలిగింది. పతనం కూడా నాకు కలిగింది. ఈ తప్పొకటి కాయమని రోజురోజూ నేను పతితపావనుని ప్రార్థిస్తున్నాను."

ఇటులుపలుకుచు పలుకుచు రామస్వామి రాతిబొమ్మవలె స్తంభించిపోయెను. అతని చూపులు తిరః ప్రస్పృతములాయెను. శరీరము గగురుపొడిచెను.

ఇట్టి రామస్వామిని ఆచి చూచుచుండఁగా మాణిక్యమునకును పూనకము వచ్చినటు లాయెను. ఆమె హృదయము ద్రవించి స్రవించుచున్నటులు కనులనుండి బాష్పములు బయలువాఱెను. ఆమె లేచి ఆకసముదెసఁ జూచి తలవాల్చి మోఁకారించి – "ఓ ప్రభూ!

నా కులాభిమానాన్ని కూల్చివెయ్యి! ఉత్తరజన్మములో నన్ను నీచకులంలో పుట్టించు! తెచ్చి పెట్టుకొన్న ఎక్కువతక్కువలలోనికిన్నీ, తెచ్చి పెట్టుకున్న పాపపుణ్యాలలోనికిన్నీ నన్ను దింపకు" అని పలవించెను.

తేనె జాతిపోవఁగా తేలికపడిన పూరేకులవంటి కనురెప్ప లెత్తి చూచిన రాసామ్మిమికి ఆ మాణిక్య మొక గణాచారివలె కానిపించెను. వారిరువురును ఒకరి నొకరు చూచుకొనిరి. వారిరువురును ఒకరిచూపులలో మతియొక రోలలాడి ఒడ్డెక్కిరి. ఇరువురును లోలోపల నిటు లనుకొనిరి కాఁబోలు: – 'నాలుకా! మాటాలాడకుము! మానసమా! ఆలోచింపకుము! ఓ ప్రభూ! కేవలము నీవే మాకు ఆదేశింపుము.'

## 4

### (గ)

"సుబ్బారా వాటపాటలలో ఎంత దిప్పకాయెా చదువుసంధ్యలలో అంత మొదటిపిల్లకాయి. అతఁడు విద్యార్థులకే కాదు సనాతనేకాదు అధునాతనే కాదు, ఒకటేమిటి అన్నిసంస్థలకునూ లీడర్. చదువతనికి ఖేల. అతఁడే ఈచచ్చుపుచ్చు పరీక్షలో తప్పితే ఇఁక ప్యాసుకాఁగలవాళ్లెవళ్లు?" అని మైత్రమ్మ వ్రాసిన ప్రత్యుత్తరము చూచుకొని చూడమ్మ తనమనసు పదిలపఱచుకొనెను.

మైత్రమ్మ వ్రాసిన ఈ యుత్తరములోని అక్షరము లన్నియు నెంత సత్యములో అవి అంత అసత్యములనియు చెప్పవచ్చును. ఏలనఁగా ఆ సంగతుల కీదిగువ సంగతులనుగూడఁ జేర్పనిచో అతని సంపూర్ణ స్వరూపములో సాఁబాలయినను పూర్తికాదు.

తలిదండ్రులు లేకపోవుటచే అదుపాజ్ఞలులేని ధనికులగు యువకులను వలచు స్వాతంత్ర్యలక్ష్మి అతని మెడలో వరమాల్యము వైచెను. పత్తన నివాసమువలనను, సంస్కారమునకు తోడుగా ప్రకృతవిద్య ప్రసాదించిన విజ్ఞానమువలనను, పరిసరముల వలనను అతఁడు విధినిషేధముల బాధలను చవిచూడలేదు. అతనికి దేనికిని లోపములేదు. అతఁడు తన యిష్టమును కొనసాగించుకొనఁగలఁడు. తానెవరికిని దేనికిని బద్ధుఁడు కాఁబనిలేదు. అతనికి సంసారబాధ లేదు. ఎవరిభయమును లేదు. అతఁడు కొన్నిటిలోనయినను అన్నిటి నెఱుఁగఁడు. కాని అన్నిటిలోని కొంత యెఱుఁగును. అతనికి వలసినంత గుండెనిబ్బరము కలదు. అతఁడు చక్కఁగా నవ్వఁగలఁడు. తీవ్రముగా వాదింపఁగలఁడు. తనపక్షము సమర్థించుకొనఁగలఁడు. లెస్సగా చదవఁడు. కాని పరీక్షలు ప్యాసు కాఁగలఁడు. ఇంద్రియములు కొంపోవు దారిలో వెనుకడుగువేయక పోఁగలఁడు. వీని అన్నింటి వలనను సుబ్బారావార్ట్సు కాలేజీలకన్న మిలిటరీకాలేజికి ఎక్కువ

పనికివచ్చునని చెప్పవచ్చును. కాని యీ మాటగూడ సిద్ధాంతముచేయుటకు వలనుపడదు. ఏలనఁగా అందము ఎచట విలువకలదో అట్టి దినుసు కంటఁబడఁగనే అతఁడు సులభముగా ఓడిపోవును.

కాని ఈ ఓటమియే అతనిమతములో విజయము ఎటులనఁగా చచ్చి మృత్యువును జయింపవలయుననుట యుపనిషన్మతము - 'వినాశేన మృత్యుం తీర్త్వా'. ఈ యోటమికూడ విజయమగునని పుట్టఁబోవు హైందవసోల్జరులు అనుమతించుచో అపుడితఁడు యోధకళాశాలకు సమర్థుఁడని అంగీకరింతముగాక!

సుబ్బారావుకు వయసు వచ్చెను. దానితో పాటు వాసన లన్నియు పల్లవించెను. అతనికన్ను కడువాడియైనది. అతఁడు దానితో జనారణ్యములోని కుఱుకును. అం దతని చూపుతుమ్మెద వాలని కొమ్మలే యుండవు.

అందగత్తెలు పలువురు తనకొఱకు వెచ్చనూర్తురని యతని నమ్మిక. తానే వారిని మిగుల వలచెనని తనకు తెలియదు. కొందఱు తనకు లేఖలు వ్రాయుదురని అతని ధీరత. తన హృదయమునందలి యొకపొరలో తాను వ్రాసిన మోహాక్షరము లున్నవని యతఁడెఱుఁగఁడు. ఇటులతని కౌతుకవృక్షము కడుదవ్వుగా వేరులు పాఱి కొమ్మలచే సాగెను. చూడమ్మ సౌందర్య సర్వస్వమును నిశ్శేష మొనరించుటకు కొండంతాశతో అతఁడు రైలు దిగెను. దిగి ఎకాయెకి రామస్వామి యింటికే వెళ్లెను.

సుబ్బారావు కానిపింపఁగనే మాణిక్యమును, రామస్వామియు ఐకకంఠ్యముగా 'పేపరు సరిగా వ్రాసితివా?' అని యడిగిరి. 'చేతనయినటులు వ్రాసితి' నని యతఁడనెను. పిదప చూడమ్మ ప్రయత్నముకన్న నెక్కువ అయిన మాణిక్యము ప్రయత్నముచే రామస్వామియింట విందులును విశేషములును, అచ్చటలును ముచ్చటలును చక్కఁగా జరిగెను. రామస్వామి వాత్సల్యమును, మాణిక్యము గౌరవమును, చూడమ్మ బెదురుచనవును అతని కీమాటు ఆనందము కలిగించెను.వారు ఏకకుటుంబీకుల వలె మమేకముగా నుండిరి.

సంఘదేవతయొక్క కుటిలకటాక్షమువలన చూడమ్మకు సాహసము మెండాయెను. సుబ్బారావు మోటారుమీఁద ఆమెదే అగ్రపీఠము. అతని భోజనభాజనముల కామెదే అంకురారోపణము. సుబ్బారావులోభలత కిదియంతయు ఎరువాయెను.

వారు సౌందర్యమును గుఱించియు, ప్రేమను గుఱించియు, సృష్టిని గుఱించియు ప్రసంగించుకొనిరి. క్రొత్తగా కనుగొనఁబడిన హైడ్రొజన్, ఆకాశవక్రత, క్లోరిన్, బ్రహ్మాండ వ్యాసము ఈ మొదలగునవిగూడ వారి ప్రసంగమునుండి తప్పించుకొనిపోలేదు.

సుబ్బారావు మోటారపుడొక నిర్జన ప్రదేశమున ఆఁగెను. ఆలోచనలలో మునిఁగి తేలుచున్నటులు గాలి మెల్లగా వీచుచుండెను. ప్రత్యుత్తరములేని ప్రశ్న ప్రవాహమువలె అచటి నది ప్రవహించుచుండెను. మోహినిచేతిలోని సుధాభాండము పగిలి నలుదెసల వ్యాపించి నటులు వెన్నెల యలముకొనెను.

చూడమ్మకు సప్తఋషులును, అరుంధతియు దర్శనమిచ్చి యానందమొసఁగి యామెదృష్టి నాకర్షించిరి.

'ఏమిటి చూచుచుంటివి?'

'అరంజోతి, మంచపుఁగోళ్లు.'

సుబ్బారావులేచి 'ఇదే మనమంచము, ఇదుగో వసిష్ఠుఁడు' అని చూడమ్మను తన కరపంజరమున బంధించెను. ఆమె తన యునికినే మఱచెను. ఆ వెన్నెలలో వారికి పడకటిల్లయన ఆ యావిరిబండి వేగుజామున గృహప్రవేశ మొనరించెను.

(ఘ)

ఆ పట్టణమునందలి క్లబ్బులో నాలుగు వ్యూహములు కలవు - 1. ఉద్యోగి వ్యూహము, 2. సంస్కార వ్యూహము, 3. సనాతన వ్యూహము, 4. స్వతంత్ర వ్యూహము.

ఉద్యోగివ్యూహమున వయసుడిగిన ఉద్యోగస్థులును, పించనుదారులును, యెమ్మెల్సీలును, బోర్డుల ప్రెసిడెంట్లును, ధనికులును కలరు. అందలివారికి ఇంచుమించు ఇతర వ్యూహమువారితో పనిలేదు. వీరిలో వీరికి సౌభ్రాత్రముకలదు. వీరికి వీరి చీట్లపేక యేమో, వీరి చదరంగమేమో! ఇటులయినను ఇచట ఇచ్ఛాశక్తి పుట్టినచో పట్టణమున క్రియాశక్తి కలుగును.

సంస్కారవ్యూహము వారందఱును ఇంచుమించు నడిప్రాయమువారు. కొందఱింటర్మీటు బి.యే. వఱకు దేఁకి కాలదోషము పట్టినవారు. కొందఱు యెస్సెస్సెల్సీలు, యెల్లెంపీలు. కొంచెము సంస్కృతము, కొంచె మింగ్లీషు వచ్చిన కొంచెగాంఢ్రును కొందఱు. చాలమంది బడితె బాజావారును కలరు. వీరు భాషను మతమును సంఘమును క్లబ్బును సర్వమును సంస్కరింపఁజూతురు. వీరికి ప్రయోజనము, తర్కము, సైన్స్ ఈ మూడును ప్రమాణము.

సనాతనవ్యూహము ద్వివిధము - 1. ఉదారసనాతన వ్యూహము, 2. సనాతన వ్యూహము.

ఉదారసనాతనవ్యూహములోనివారు పలువు రేఁబదికిపైఁబడిన పింఛన్ దారులు

థియాసఫిస్టులు సత్సంగులు చైతన్యులు. కొంచెగాంధ్రుని ఈ వ్యూహమున లేకపోలేదు. ఉద్యోగములు దొరకకపోవుటచే విరక్తికలిగిన పెద్దచదువులవారు ఇందుఁగలరు.

స్వయంపాకము రుచిగా నుండకపోవుటచే క్లబ్బుకు సంబంధించిన కాఫీశాలలో శుచియగుచోటు వలసినంత లేకపోవుటచే 'రూమ్-డి ఆర్థడాక్స్' వద్ద, అనఁగా ప్రాయిముందు గజముచోటులో స్వతంత్ర్య వ్యూహమువారు సర్వసమత్వము చూపిపోయిన పిదప వీరు భుజింతురు. క్లబ్బుకు సంబంధించిన నాటకశాలలో స్త్రీలు ధరించిన స్త్రీ పాత్రములు చూచి ఔచితిని గ్రహింతురు. కాని స్త్రీలకది నిషిద్ధ మని యందురు. ప్రతి దానికిని ప్రమాణము దొరకకున్నను'సతాంహి సందేహ పదేషు వస్తుషు ప్రమాణ మంతః కరణ ప్రవృత్తయః' అనుమాట నంగీకరింతురు. మానవునిలో దేవత్వ మంతర్ముఖముగను, మానవత్వము బహిర్ముఖముగను, పశుత్వ మీరెంటినడుమను ఉన్న దనివీరి నమ్మకము.

సనాతనవ్యూహము కలగూరగంప, ఇందు సంస్కృతయెమ్మేలు, స్కూల్ ఫైనల్ శిరోమణులు, విద్యాప్రవీణులు, తెలుఁగు, సంస్కృత, ఉభయటీచర్లు, అనక్షరులు వగైరాలు కలరు. వీరు శతాబ్దులనుండి వచ్చుచున్న సంప్రదాయములకు రక్షకభటులు. ధర్మాచారములకు వీరు తేదా పాటింపరు. నోరాచరు. మనుష్యుఁడొకమర. ఈ మరను నడిపించునది భూతకాలము. వీరికి 'రూమ్-డి ఆర్థడాక్స్'తో ఐహికముగాఁ గాని, ఆముష్మికముగాఁగాని సంబంధము లేదు. వీరికి పరధర్మము, పరభాష పరకీయము సర్వమును మ్లేచ్ఛము.

స్వతంత్రవ్యూహములో పనిపాటలులేనివారు పెచ్చు, స్త్రీలు లొచ్చు. పెద్దపెద్ద చదువులు చదివినవారు వీరి తరువాత. చదువులు తప్పినవారు పిదప. సెలవులలో ఇంటికివచ్చినవారు పిమ్మట.

ఆ బ్రహ్మస్తంబపర్యంతమును వీరి విమర్శమునకు లక్ష్యము. వీరికి ఇచ్ఛాశక్తి క్రియాశక్తు లొకతూరియే కలుగును; ఒకతూరియే మగుడును. సంస్కారవ్యూహమువారికి వీరు అప్పీలు (Appeal) మానవుఁడు ఒప్పుచేయుట కెటు లధికారియో తప్పుచేయుటకును అటులనే యధికారియని వీరియభిప్రాయము. తప్పు తెలిసినపిదప దిద్దికొనకుండుట వీరిలోలేదు. వీరు భూతకాలమునందలి మేలును గ్రహించి కీడును ఉచ్ఛేదింతురు. వీరి యెడమచేతిలో 'సైకో ఎనాలిసిస్', కుడిచేతిలో 'సైన్స్' మానసక్షేత్రమున యడుగు పొరలోఁబడి మొలవని విత్తులను వీరు సాగుచేయుదురు. నిన్నటివఱకును మనఃపద్మమున కాఁపురమున్న దేవతలకును, దయ్యములకును వీరు చేఁటదెబ్బ కొట్టిరి. సూర్యనారాయణ మూర్తివారి యేడుగుఱ్ఱములకును కళ్లెములు కోసి తన్ని తగిలి శ్రీవారిని నెగడిగాఁ జేసిరి.

శ్రీమహావిష్ణువు మూవురు భార్యలలో నొకతెయయిన భూదేవిని ఆదిశేషువు పడగల మీఁదినుండి దింపి మట్టిముద్దయొనరించిరి. ఈ మట్టిముద్దను సెకండుకు పందొమ్మిది మైళ్లవంతున పైనెగడి చుట్టును పరుగు లెత్తించిరి. ఇంద్రునిచేత వజ్రాయుధమును లాగి ఎలెక్ట్రిసిటీని ఇచ్చిరి. సృష్టిపనినుండి బ్రహ్మగారికిసెలవొసఁగి పరిణామమున కాపని పెట్టిరి. సృష్టియొక్క వ్యాసము ఇంచుమించుగా 6264563328000, 000,000,0000 మైళ్లు ఉండునని అనుమానించిరి. వర్తమాన భవిష్యత్తులమీఁద వీరు భావనారాజ్యము (Utopia) కట్టిరి.

ఈ వ్యూహములలో ఏ రెండువ్యూహములకును మతైక్యము లేదుగాని సనాతనవ్యూహము వినా మిగిలిన వ్యూహములకు భిన్న భాండాశనములేదు.

లోకకల్యాణమునకుఁగాను శ్రీ మహావిష్ణువు వ్యూహ చతుష్టయముతో విరాజిల్లు చున్నటులు పట్టణ కల్యాణమునకు ఆ క్లబ్బు ఈ వ్యూహ చతుష్టయముతో విరాజిల్లెను.

బస్తీలలో పనిపాటలులేని ధనికులు ఘరానామనుష్యులు లేక జంట్లిమన్లు అయిపోవుదురు. సుబ్బారావిటులయిపోవుటయేగాక క్లబ్బులో మెంబరుగిరీ సంపాదించి దేవత్వమునుగూడఁ బడయఁగలిగెను. అంతటితో సతఁ డాఁగఁదలఁచుకొనలేదు. తనయెఱుకలో చదువు వచ్చినట్టియు రానట్టియు ఆఁడంగులను క్లబ్బుదేవులనుగాఁజేయఁ బూనుకొనెను. స్వాతంత్ర్య సంపాదనము కొఱకు గాలికన్న వడిగాఁ బరుగిడు క్లబ్బుదేవులుకొందఱు తమ యజరత్వామరత్వములను నిలుపుకొనుటకు రెండు పూఁటల నమృత మారగింప క్లబ్బును కాఫీక్లబ్బుగా మార్చివేసిరి.

ఈ క్లబ్బుకు వెనుకనున్న యావరణములో వ్యూహము లన్నియు విడిసెను. వేదికలచుట్టును కుర్చీలు గుండ్రముగా వేయఁబడెను. దివియలు వెలుఁగుచుండెను. సోడాబుడ్లు మ్రోఁత వినఁబడఁదొడఁగెను. స్వతంత్ర వ్యూహమునందలి పురుషసింహముల గర్జనములలో కోమలుల కలకంఠముల ప్రేక్షకులకర్ణముల నాకర్షించుచుండెను. ఉదార సనాతన వ్యూహమునందు పాశ్చాత్య సిద్ధాంతము లన్నియు సిద్ధాంతలేశ సంగ్రహమున ఇఱికింపఁబడుచుండెను. "నెలకు ముప్పదిమంది విధవలు ఇస్లాముమతమునఁ జేర్పఁ బడుచుండి" రని సంస్కార వ్యూహమువారు దుఃఖించుచుండిరి. పెద్దవ్యూహములో బ్రిడ్జి తయారగుచుండెను. చదరంగములో రాజ్యములు తలక్రిందులగుచుండెను. క్లబ్బు ఇటులు కలకలలాడి పోవుచుండెను.

జడ్జిగారును, కుంచాల అంకమయ్య యెమ్మెల్సీ గారును చదరంగ మాడుచుండిరి. అంకమయ్యగారిది చాల గొప్పయెత్తు. కాని ఆనాఁడతఁడు పరధ్యానముగా నుండెను.

జడ్జిగారు గుర్రముతో 'రాజు' అని అనీ అనకముందే అంకమయ్యగారు "అహహహ, ఒకపక్క శారదాబిల్లు, ఒకపక్క ఇంటివాళ్లు, ఈనడుమ నన్ను నలిపేశారు" అని పిమ్మట "నా ఆట కట్టింది" అని కుర్చీకి జేరగిలఁబడిపోయిరి. జడ్జిగారు పకాలుననవ్వి "ఇవ్వాళ మీరీలోకంలో ఉన్నట్టు లేదు. ఈ యాటంతా మీకు పెళ్లివలె కనఁబడుతూంది" అని యనిరి. 'ఔనండీ! జరిమానా సర్కారుకట్నంకింద లెక్కచూచుకున్నా యెమ్మెల్సీ పని పటతారనే సందేహం' అని అంకమయ్యగారు మఱియొక యాటకు బలగమును సర్దఁ దొడఁగిరి. 'మునిసిపాలిటీవారి జాతకాలు మాఱుత'వని జడ్జీగా రనిరి.

మఱునిముసముననే ఈమాట నూతిలో రాతివలె సంస్కారవ్యూహములో పడెను. 'పెద్దవాళ్లకు మతీ మతోతూంది. పిల్లకు పదేళ్లు లేవు పెళ్లిఁట. సుబ్బారావు విడో మ్యారేజి చేసుకోని కళ్లు తెరిపిస్తాఁడు' అని వారందఱైకకంఠ్యముగా తమ అసమ్మతిని వెల్లడించిరి.

తరువాత ఈవార్త ఉదారవ్యూహమునకు ప్రాఁకెను. వారెల్లరు తాముగూడ తాంబూలములు పుచ్చికొనినటులు సంతసించిరి. పిదప సనాతనులకు తెలిసెను. "రామస్వామి విధవోద్ధారకసభవారి కిచ్చిన వేయిన్నూటపదార్లలో ప్రతిదమ్మిడీకిన్నీ, మాణిక్యము చూడమ్మచేత చయనమ్మగారి మేనమామకూఁతురి కని ముట్టచెప్పించిన చీర రవికెలలో ప్రతినూలుపోగుకున్నూ విలపించేట్టుచేశాఁడు సుబ్బారావు"అని వారు సుబ్బారావుయోగ్యత నభినందించిరి.

స్వతంత్ర వ్యూహమువారీమాట విని అంకమయ్య అనభిజ్ఞతకు ఆశ్చర్యపడి "అతఁడిదివఱకే చూడమ్మను వరించాఁడు. పెండ్లి అనేది మామతంలో 'చేసుకోవాలి' అనిలేదు. అయినా దీని సత్యాసత్యాలు సుబ్బారావునే కనుక్కుందాం" అని అతనికొఱ కన్నెత్తి చూచిరి. ఇంతవరకును వారినడుమనే యున్న సుబ్బారావిపుడేఁడీ?

**(ఐ)**

లతలను జూచి చెట్లును, చెట్లను జూచి లతలును విఱుగఁబూచెను. అదేమి చోద్యమో కొండతంగేళ్లంతయు పూవులయిపోయెను. ఎక్కడినుండియో గాలికి పరిమళము పుట్టుకొనివచ్చెను. ఋతులక్ష్మికి తఱుగు లేదనిపించెను.

ఒకానొకపుడు తనకు స్వాభావికాహారమయిన పండును మానవుఁడపుడు రుచిచూచెను. శరీరములందు తేజము కానిపించెను. ప్రాణములు చంచలము లాయెను. మనోమయకోశము చిగిర్చెను.

జ్యోతిష్కులయు, పంచాంగములయు ప్రాబల్యము హెచ్చెను. గ్రహములకు లేని బలమును లంచములు సంపాదించి పెట్టెను. దానివల్ల లగ్నమాత్రమునకు వినియోగము

కలిగెను. గృహప్రవేశములతోడను, వడుగులతోడను, వివాహములతోడను పక్కణములును, పల్లియలును, పత్తనములును కలకలలాడెను.

రామస్వామి యింటిముందు సన్నాయిపాటయు, పిల్లఁగ్రోవిపాటయు పర్యాయముగా వినఁబడఁదొడఁగెను. ఆ మేడలో ఒక పెండ్లివారు విడిసిరి. ఇల్లు వాకిలి మేడ దొడ్డి సమస్తము జనముచే కిటకిటలాడుచుండెను.

చావడిలో అరగజ మెత్తును, ఇరువదిగజముల చదరమునగు బల్లయొకటి వేయఁబడెను. దానిమీఁద మూరెఁడెత్తు పఱుపును, పెద్దదిండ్లును పరపఁబడెను. దానిమీఁద పెండ్లికొడుకు అధిష్ఠించెను. అతని కదలికకును నిమేషమునకును నిశ్వాసమునకును అర్థమెఱింగిన బంట్లును బందుగులును మిత్రులును ఆయా యీ పనులు సాధించుచుండిరి. చూచుచున్న చూడమ్మ కాపెండ్లికొడుకేడు దీవుల యావలినుండి దండెత్తవచ్చిన రాచకొడుకు వలె కానిపించెను.

మేడమీఁది చావడి అలంకారమందిరముగా మాఱెను. దానికిరుప్రక్కలనున్న గదులు స్నానశాల లాయెను. అలంకారాగారమునందలి పెద్దబల్ల చీరలచే రైకలచే జాకట్లచే బ్లౌజులచే బాడీలచే అంగడియయిపోయెను. అపుడే జలకమాడి వచ్చిన జలజాక్షుల అవయవములనుండి పొఱలెంచు పలురకముల సబ్బుల యుగగ్రంథము మానవులకే కాక దానవులకును దగ్గ రప్పించుచుండెను. నిలువుటద్దములకడ నిలిచిన మేజాలన్నియు రకరకముల పౌడర్లయు, స్నోలయు, సెంట్లయు పెట్టియలచే నిండెను. ఇటులు ఆ యాంధ్రాంగనామణులందఱును విదేశవస్త్రములు తాల్చి విదేశాంగరాగము లలఁదుకొని (వారిశరీరస్వత్వముగూడ వారి భర్తలదేయగునెడల స్వకీయమని చెప్పఁదగిన దేదియులేదు) వివాహపూర్వరంగమును సిద్ధపఱిచిరి.

పురుషుల స్నానశాల క్రింద వారియలంకారగ్రంథమంతయు వసారాలో. సబ్బుగూడ వారికిని నాగరికతలో ఒకయంగము. విశేషించి పెండ్లికి వచ్చిన యేగంధర్వుఁడు కుంకుడుకాయల పులుసుతో తన మోటుదనము నితరులకు చూపెట్టును?

పిన్నవారందఱును చిన్న మంగలిపెట్టెలును ముందిడుకొని చేయద్దముల నెదట నిలువఁబెట్టి సొంత మంగళకర్మతో అంగరాగములతో తమకును ఆఁడువారికిని అంతగా భేదము లేకుండ అలంకరించుకొనిరి. వారందఱును కాంగ్రెసుకు చందాదారులే కాని మాంచెస్టరుకు వారి యంగడులే పునాదులు. గ్లాస్కోమల్లులు వారి నగ్నతకు నగిషీచేయును. ఆయము వలనఁగలిగిన పరలోకబాధను వారు కన్యకాపరమేశ్వరి మీఁద పాఱవేయుదురు.

ఇటులు లక్ష్మి తాండవమాడుచున్న యీ వివాహవైభవము చూడఁగనే చూడమ్మ

హృదయములో నొకానొక యావేశతరంగము చెలరేఁగెను. అంతట నామె యేరికిని గానరాలేదు.

మాణిక్యము ప్రొద్దుటినుండి సాయంకాలమువఱకును పెండ్లివారిలో ఎచటఁ జూచినను తానయై తిరుగు చుండెను. పెండ్లివారామెకు కూర్చుచుట్టములు. ఈ తిరునాళ్లలో ఆ తల్లి తనకూఁతురిమాట మఱచెను.

సంధ్యాసమయ మతిక్రమించెను. విద్యుద్దీపములు వెలుఁగుచుండెను. పెండ్లిపెద్దలు వలువలను వెండి బంగారములను నగకట్టును వెలికిఁదీసి సర్దుచుండిరి. అపుడు వియ్యపురాలొక నగలపెట్టె తెచ్చి నాణెము చేయుటకు మాణిక్యముముందు పెట్టెను. అవియన్నియు కన్యకాపరమేశ్వరి రూపమును వ్యక్తీకరించుచుండెను. మాణిక్యము వానిని మెచ్చుకొనెను. వానిని తనకూఁతురికి చూపఁదలఁచెను. ఇంటిలో నెచటను కానరాకుండుటచే దాసిని సుబ్బారావుగారి యింటికిఁ బంపెను. దాసి వెనుదిరిగి వచ్చి 'పొద్దుట్నుంచీ యిక్కడికి రాలేదన్నారుండీ' అని చెప్పెను.

మాణిక్యముగుండె గుభేలుమనెను. వెనుక తాము చూడమ్మను వెతికిన విషయము గుఱుతు దవిలెను. వెంటనే అంతటను వెదకెను. కూఁతురు కానరాకుండుట భర్తకుఁ జెప్పెను. అతఁడును వెదకివెదకి విఫలుఁ డాయెను.

ఇంతలో దాసివచ్చి 'అమ్మాయిగారు ఆమూల సామానుకొట్లో ఉన్నారండీ! ఆయమ్మనుచూస్తే భయమేసి పరుగెత్తుకొచ్చాను' అని విన్నవించెను.

'ఉరి పెట్టుకోలేదుగద' అని రామస్వామి దంపతులు దీపము తీసికొని గబగబ పరుగెత్తిరి. ఆ దీపపరిమండలము సమీపించునంతలో తాను వ్రాసి వినోదించుచున్న తమ పెండ్లిచిత్తరువునుదాఁచి లేచి నిలువఁబడి – 'అమ్మా చోటులేక యిచట కూరుచుంటి' నని గద్గదస్వరముతో పలికెను.

మాణిక్యము దీప మెత్తెను. ఆమె ముంగురులు తడిసియుండెను. అసలే పెద్దవయిన కనులు మఱికొంచెము పెద్దవయి ప్రత్తికాయ లాయెను. చెక్కులు జేగురు పులుమఁ బడినటు లుండెను. ఈ యాకారమునకుఁ గల యర్థమును గ్రహించి మాణిక్యము కూఁతురిని కౌఁగలించుకొనెను. ఆమెకంఠమునుండి అస్పష్టముగా బయలు దేఱిన రోదనధ్వని ఉహుహుహు అని శరీరకంపముగా పర్యవసించెను.

రామస్వామి యీ శోకమును పట్టఁజాలక యిటులనెను – 'అమ్మా! ఇంటిలో నొకగదియేని ఖాళీగాలేదు. నీ గదిగూడ నిండిపోయినది. ఈ రాత్రి బావగారియింట మన విడిది. ముందు నీ వచటికివెళ్లుము.'

ఈ మాటకు చూడమ్మగుండె లదరెను. ఆమెను కౌఁగిలించుకొనియున్న మాణిక్య మా యదరుయొక్క బలవేగముల పరిమాణమును లెస్సగా గ్రహించి యిటులనెను - 'అమ్మా! మనకు ఈపూఁట పాచకుఁడక్కడ వంటచేస్తున్నాఁడు. మాకుఁగూడా ఇక్కడ పిసరంత చోటులేదు. మేము అక్కడికే వస్తున్నాము. నీవు ముందు మంచాలవారి యింటికి పద.'

## 5

### (క)

దేశపురాజులు దక్షిణమున కొనయూపిరితో నున్నంతవఱకును ప్రజలు తమ బంగారమును తీసికొని పోయి టంకసాలలో నాణెములు కొట్టించుకొని ఉపయోగించు కొనుచుండెడివారు. ఈ విషయమున రాజుల కెట్టి హక్కుకలదో ప్రజలకును అట్టి హక్కుకలదు. ఏ దేశములోఁగాని, యే కాలములోఁగాని ఆ నాణెము తనలో నుండు ప్రాణమును, అనఁగా బంగారపు వెలను కోలుపోయెడిదికాదు.[1]

తురకరాజులు వెండినిగూడ నాణెముచేసిరి. వీరిసమయముననే నాణెములందు ద్వైతమత మారంభమాయెను. అపుడు వెండినాణెము యొక్క వెలయు, బంగారునాణెము యొక్క వెలయు వానిలోని లోహముల వెలయంతయే యుండెడిది. వాని మాఱకముగూడ లోహములవలనే యనుసరించెడిది.

కుంఫిణీవారుగూడ లాభమును కనిపట్టి 1835 సాలున ఒకతులమెత్తు తూకము గల వెండిరూపాయను ముద్దరకొట్టిరి. అంతటితో హిందూదేశమున బంగారు నాణెము అనఁగా బంగారువిత్తనము నాశనము కాఁదొడఁగెను.[2] పిదప వెండినాణములే పైరు చేయఁబడెను. ఈరీతిగా ద్వైతవిధ్వంసను (Bimetalism) కలిగి నాణెములకు అద్వైతసిద్ధి (Monometalism) కలిగెను.

సీమలో బంగారునాణెములకే ప్రచారము కలదు. భరతఖండము నందు వెండినాణెముకే అనుజ్ఞ కలదు. భరత ఖండము సీమకు పలురకముల పన్నులుకట్టవలెను. ఎగుమతి చేయవలెను. దాని కెక్కుడు దిగుమతిచేసికొనవలెను. తానిక్కడనేయుండి తనకు సీమలోఁగల సొంతయింటిని భరింపవలెను.[3] తాను సీమలో డబ్బు నిలువచేసికొనవలెను.[4] తనను పరిపాలించిపోయిన వారికి పింఛను లీయవలెను. ఇటులెన్నియో రీతులుగా సీమకును భరతఖండమునకును లావాదేవీలు కలవు.

భరతఖండము సీమకు ఈయఁగలిగినది వెండినాణెము. సీమకు కోటిపౌను లీయవలసియున్న యెడల సీమయొక్క బంగారునాణెములకు సరిపోవు నన్ని రూపాయల

నీయవలసియుండును. అపుడు వెండిబంగారముల లెక్క కట్టవలసి యుండును. వానివెలలు రేపటికి మాపటికి మాఱుచుండును. తడవతడవకు వెలకట్టుటచే ఆలస్యము, విసుకు మొదలగు చిక్కులు కలుగుచుండును. ఈ అపాయము లేకుండుటకు దొరతనమువారు 1872-3 సంవత్సరములనడుమ కాఁబోలు 'రూపా ఇంత' అని ఒకయేర్పాటు కావించిరి. ఆ'యింత' అంతటితో ఆఁగలేదు.[1] ఆఁగదు. ఆఁగుటకు వీలును లేదు. రూపాయ విలువ ఒక షిలింగు ఒకటిన్నర పెన్నులనుండి రెండు షిల్లింగులవఱకును అపుడపుడు మాఱుచు వచ్చెను. ఇంతియకాదు. నాఁటిరూపాయయు మాఱుచువచ్చెను. నాఁటిరూపాయి బండబ్బాయి. నేఁటిరూపాయ అల్లరి పిల్లకాయ.

సీమకు యుద్ధమువలనఁగాని, వాణిజ్యమువలనఁగాని, మఱిదేనివలనఁగాని చిక్కులు కలిగినపుడు దాని యోగక్షేమములకొఱకు హిందూదేశమున నున్న రూపాయ ఉలికిపడుచుండును.[2] 1919 సాలున రూపాయ రెండు షిలింగు లాయెను. దానితో హిందూదేశమునకు ఎగరొప్పు పుట్టెను. 1927 సాలునరూపాయ షిలింగు ఆఱు పెన్నులాయెను. అది నాఁటనుండి నేఁటివఱకును మాఱలేదు.

1927 సాలున భారతలక్ష్మియొక్క ఫాలఫలకమున భాగ్యాక్షరములు వ్రాయు బ్రహ్మ మహిమవలనను, టంకసాల యను యాయాగృహమువలనను, రేషియో లేక మాఱక మను ఇంద్రజాలమువలనను హిందూదేశమునందెక్కడి సరకక్కడ గుట్టలు పడిపోయెను. దేశపుసరకుకు వెల హెచ్చెను. అది దేశములోనే అమ్మకము కానపుడు లాంతి దేశములలో కాదుగదా! సీమసరకుకు వెల తగ్గెను. డబ్బు కనఁబడినంతవఱకును అదియిచట విడుదల యాయెను. ఈరీతిగా ఎగుమతి ఆఁగెను. దిగుమతి సాగెను. దానివలన ఉన్నంతవఱకు డబ్బు ఊడ్చుకొనిపోయెను.

క్రమముగా పంటల వెలపడెను. సేద్యమునకు విత్తనములవెల మళ్లుట కష్టమనిపించుచుండెను. దేశాంతరములనుండి చౌకగా బియ్యము మొదలగునవి దిగుమతి కాఁదొడఁగెను. ఇటులు సేద్యగానికి ఎడాపెడాదెబ్బలు తగిలెను.

పంటలు గల కాటక మిటులు భయంకరముగా వ్యాపించెను. భూదేవివెల కోలుపడెను. వడ్డీవ్యాపారముచేయువారు వాపోయిరి. ఋణగ్రస్తులు ఋణదాతలకు దొంగలయిరి. కర్షకులకు కాలుసేతు లాడక పోయెను. మరలు ఆఁగెను. సాహుకారులు దివాలా తీసిరి. ఈ క్షామబాధ ధనములేని మనుష్యమాత్రుని బాధింపఁగా ధనికుఁడగు రామస్వామిని బాధింపకుండునా?

అతఁడు రెండుమూడునెలలలో చిల్లరదుకాణమునకును మరలకును గలిగిన నష్టమును సవరించుకొనఁగలిగెను. మరలను మూసివయిచెను. కోస్తా వ్యాపారమును

ఎత్తివేయుటకు చెన్నపట్టణమున తనకున్న అంగడిని సరకును చూచి సిబ్బందితో ఆలోచింపఁ దలఁచెను.

అతనికి ఈ క్షామబాధకన్న మఱియొక పెద్దబాధ కలదు. అల్లుఁడున్నాఁడు, కూఁతురున్నది. కాని పెండ్లి మాట తలపెట్టుటకు వీలులేదు. కాన నతఁడు దీర్ఘముగా నాలోచించి కొన్నాళ్లపాటు కాఁపుర ముండుటకు చెన్నపురికి ప్రయాణము కట్టెను.

చెన్నపట్టణము చేరిన మఱుసటి రోజుననే చూడమ్మ మైత్రమ్మను కలిసికొనఁ గోరెను. కాని అది యొనఁగూడకపోయెను. మగనికి విడాకులిచ్చి ఆమె బొంబాయిలో మఱియొక వరుని అన్వేషించుచున్నదని సుబ్బారావువలన చూడమ్మ విని పరితపించెను.

(ఖ)

సుబ్బారావుతండ్రి వీరేసు. రామస్వామి తండ్రి వెంకటేసు. ఈ యిరువురిది ఉమ్మడి వ్యాపారము.

మహాయుద్ధము జరుగుచున్న సమయమున ఇనుపవర్తకము విరివిగా చేసి వీరు లక్ష లార్జించిరి. ఎవఁడో గోసాయి యిచ్చిన పసరు పూసి యినుపరేకులను వీరు బంగారపు రేకులుగా మార్చిరని లోకు లనుకొనిరి.

వెంకటేసు కుబేరుని జయింపఁగోరినటులు పరలోకమున కరిగెను. పిదప రామస్వామి తండ్రి సాగించిన వాణిజ్యమున కందుకొనెను. రామస్వామి సత్యసంధతకును, సూక్ష్మ బుద్ధికిని అబ్బురపడి వీరేసు విడిపోలేదు.

కొలఁదికాలములోపలనే వీరేసుకు జబ్బుచేసెను. అతఁడొకనాఁడు రామస్వామిని బిలిచి 'అబ్బాయి! దిక్కులేని నా కుర్రవాణ్ణీ, వాఁడివాటాను నీచేతిలో పెట్టి ఎన్ని కష్టాలు వచ్చినా మావాఁడికీ, మావాఁడివాటాకూ నష్టం కలిగించవని నమ్మి నేను మీనాయన గారిలో వాటా పుచ్చుకోడానికి పోతున్నాను. నీవు ఇందుకు ఒప్పుకోకపోతే నాకక్కడ వాటా సులభంగా దొరకదు' అని చెప్పెను.

ఇది అంత సులభముగా ఒప్పుకొనఁదగినదియు కాదు, ఒప్పుకొనకుండఁ దగినదియు కాదు. కావున రామస్వామి మిన్నకుండెను.

వీరేసు ప్రాణములు పోలేదు. అవి అతనినే కాక చూడవచ్చిన చుట్టాలనుగూడ బాధింపఁదొడఁగెను. 'ఉమ్మడివర్తకాలలో లాభనష్టాలు సమంగాపంచుకుంటారుగాని ఎవ్వరూ లాభాలే పంచిపెట్టరు. ముసలివాళ్లు డబ్బుమీఁది తీపిచేత ప్రాణాలు వదలలేక అలా కోర్తారు. కాస్త అల్లాగే నని రామస్వామి తలాడిస్తే ముసలాఁడు సుఖంగా ప్రాణాలు వదులుతాఁడని అందఱును అనిరి. రెండుమూడురోజులు చూడలేక చూడలేక రామస్వామి

ఒప్పుకొనెను. రామస్వామి ఒప్పుకొనఁగనే వీరేసు వేంకటేసులో వాటా పుచ్చుకొనెను. నాఁటినుండి నేఁటివఱకును వారివాణిజ్యము ఉమ్మడిగనే వచ్చుచుండెను.

1929-30 సాలులనడుమ లోఁగడ నిలువ చేసియుంచుకొనిన వడ్లు బియ్యము ప్రత్తిబట్టలు మొదలగు సరకంతయు వారి ఉమ్మడిలక్ష్మికి హడలు పుట్టించెను. పెట్టుబడులకు చేఁటలంత చేలు కట్టుకొనవలసివచ్చెను. ఈయవలసిన అప్పులను పైసలతో చెల్లింప వలసివచ్చెను. మహాయుద్ధమువలనను, వెండినాణెములవలనను, మాఱకపు మాయ వలనను లక్ష్మికి క్షయ అంకురించుటచే కొనువారు లేక కోస్తా సరకంతయు గోదాములలో క్రుళ్లిపోఁదొడఁగెను.

రామస్వామి చెన్నపట్టణమున కాలుపెట్టినది మొదలు గుమాస్తాలచే చుఱుకుగా పనిచేయించి లెక్క లన్నియు తయారు చేయించెను. చదువుకు భంగము కలుగునని యింతవఱకును సుబ్బారావుకు ఈవిషయ మిసుమంతయు తెలుపలేదు.

మాణిక్యము పట్టుపట్టి సుబ్బారావును పూఁట కూళ్లయింటికి పోకుండఁజేసెను. అతఁ డెక్కడతప్పి పోవునో యని చూడమ్మ అతనిచదువులలో కొంత పాలుపుచ్చుకొనెను.

ఈ వ్యాపారమంతయు పెండ్లియాడితీఱవలయునను నిర్బంధమే యని సుబ్బారావనుకొని నవ్వుకొనెను. 'రామస్వామిగాని మాణిక్యముగాని తుదకు చూడయుఁ గాని యీ ప్రస్తావన చేయనిదే నేనేల కల్పించుకొనవలయును? కందకు లేని దురద చేమకేల?' అని యతఁడు తలపోసెను.

అంతలో సెలవులు వచ్చెను. సుబ్బారావుకు ఇంటికి పోవలయునని లేకున్న నాలుకమాత్రము ఆకాసంతమాటను వెడలఁగ్రక్కెను.

మాణిక్య మిటులనెను - 'ఇల్లంతా ఇక్కడే వుంటే అక్కడికి వెళ్లడమేమిటి? అదీగాక ఇవి కొద్ది రోజుల సెలవలాయె. వెళ్లడమూ రావడమూ హడావుడే కాని అక్కడ మతేమీ విశ్రాంతి ఉండదు. అదన్నీ కాక అక్కడ పూఁటకూళ్లమ్మ మెతుకులు తినిపించడం నా పనిగాదు. ముఖ్యంగా ఈకారణంచేత నేనక్కడికి వెళ్లనియ్యను.

చూడమ్మ రహస్యములో నిటులనెను - 'వెళ్లఁదలఁచుకుంటే తొందరగా వెళ్లండి. మే మిక్కడ ఉన్నామని మాత్రం జ్ఞాపకం ఉంచుకోండి.'

సుబ్బారావిటులనెను - 'జ్ఞాపకం ఉంచుకోక పోయినా ఎల్లాగో కాలేజికి రావాలసివొస్తుంది. ఏం?'

చూడమ్మ యిటులనెను - 'జ్ఞాపకం ఉంచుకోక పోవడమనేదే కలిగితే ఇక్కడుండీ కూడా జ్ఞాపకం ఉంచుకోకుండా ఉండచ్చు.'

నవుకరు వచ్చి – 'అయ్యా, తమర్ని రామస్వామిగారు ఒకసారి దయచెయ్యమన్నారు" అని మనవి చేసెను. ఆ మనవితో సుబ్బారావు మొగము సుద్దవలె తెల్లఁబడెను. వెంటనే యతఁడు చూడమ్మకేసిచూచి 'ఇదిగో వస్తున్నాను పద' అని అనెను.

సుబ్బారావు వెళ్లువఱకు బండెఁడు లెక్కల పుస్తకముల నడుమ రామస్వామి కూరుచుండియుండెను.

అతఁడు సుబ్బారావును జూచి 'కూర్చో' అనెను. సుబ్బారావు గుండెలు దడదడ కొట్టుకొనెను. అతఁడు దీర్ఘాలోచనతో కూరుచుండెను.

రామస్వామియిటులనెను – 'మీ నాయనగారూ మానాయనగారూ చాలా గడించి మనకు ఇచ్చి కాలం చేశారు. మీనాయనగారు పరమపదిస్తూ 'నీ విషయంలోనూ నీ కాతావ్యాపారాల విషయాలలోనూ నన్ను నమ్మారు. వారు నా మీఁద ఉంచిన నమ్మకానికి నీవు ఇపుడు పరీక్షకుఁడవు కావాలి. ఏంచేతనంటే ధరలు పడిపోయినవి. ఆర్థికరాజ్య మరాచక మయిపోయింది వ్యాపారము దివాలలోకి వచ్చింది.'

'మిమ్మల్ని నేను పరీక్షచేసేపాటివాఁడనా? అది అల్లా ఉంచి ముందర చేయవలసిన పని యేమిటో చెప్పండి.'

'ఈ లెక్కలన్నీ చూచి చక్కగా మనసుకు పట్టించుకో. తరువాత నా అభిప్రాయం చెపుతాను. నీ అభిప్రాయమూ చెబుదుగాని. లెక్కలుచూచుకొన్న తరువాత అసలు ఎవరి అభిప్రాయాలతోటీ పని ఉండదు' అని రామస్వామి సుబ్బారావుచేతికి కాతాపుస్తకమిచ్చెను.

చివరయంకెలు చూడఁగనే సుబ్బారావుగుండె దడ అఁగెను. వీరేసు చనిపోయిన తేదీ మొదలు నేఁటివఱకు వచ్చిన లక్షలకొలఁది నష్టమంతయు వెంకటేసు వాటాకు మాత్రము కట్టఁబడెను. వీరేసు చనిపోవు తేదీ నాఁడు ఉన్న మూలధనము వడ్డీతో నిలువయుండెను.

సుబ్బారావుకు గుండెదడ అడఁగుటయేకాక అశ్చర్యము కలిగెను. పిమ్మట లోఁతుగా ఆలోచించి లోపల ఇటులనుకొనెను : ఇది రామస్వామి ఐహికాన్ని ఆముష్మికాన్ని కూడా సంపాదించడానికి ఎత్తిన ఎత్తు. నష్టమంతా తానుపంచుకొని లాభమంతా నా కిచ్చినా రేపిదంతా తనకూఁతురే అనుభవిస్తుంది. రామస్వామికి సర్వస్వమూ వాకట్లోంచి పోతూందికాని వెంటనే దొడ్డిదారిని తిరిగివస్తూంది.'

ఇటు లతఁడు రామస్వామి ఎత్తును గ్రహించి పైకి ఇటులనెను : 'నష్టమంతా మీరే కట్టుకుంటే ఇఁక ఉమ్మడివ్యాపార మనేది నేతిబీఱకాయ. కాఁబట్టి నష్టములో నాకుఎట్లా పాలులేకుండా పోతుంది?'

'నాయనా! వివేకవంతులు మాటాడవలసిన మాట చెప్పినందుకు నిన్ను ఆశీర్వదిస్తున్నాను. కాని మీ నాయనగారు పోతూపోతూ – మావాఁడికీ మావాఁడి వాటాకూ ఎంతకష్టం కలిగినా నష్టం కలిగించవని నమ్ముతున్నాను - అని నిన్నూ నీవాటాను నా కప్పగించారు. నే నందుకు అచ్చుకున్నాను. అదుగో చూడు మీ నాయనగారు పోయినతేదీని కాతాలో తలమీఁద ఆ వాక్యములే కనఁబడుతుంది' అని రామస్వామి కాకితము తెఱచియిచ్చెను.

సుబ్బారావు విప్పారిన నేత్రములతో ఆ యక్షరములుచదువుకొనెను. అతనికనులు చెమర్చెను.

(గ)

రామస్వామిచేత ధర్మమును నాలుగుపాదములతో నడిపింపఁగలందులకు సుబ్బారావు పూనుకొనుటచే నతనికి ఇంటిదెస మొగము పెట్టుటకు వీలుకలుగులేదు. అతఁడు రామస్వామి సత్యసంధతను మాణిక్యము ముందును, చూడమ్మ ముందును బహిరంగముగా చాటెను. తుదకు ఇసుమంతయు బలవంతము లక్కఱలేకయే తనతండ్రి పోవునాఁటికి నిలువయున్న ధనమును వడ్డితో కలిపి పుచ్చుకొనెను.

సుబ్బారా విందులకుచాల లుకలుకలు పడవలసివచ్చునని లోలోపల బాధపడుచుండెనుగాని అప్రయత్నముగా ఆపని నెఱవేఱెను. ఈలాభమంతయు అల్లునికి అరణమని అతఁడు లోలోపల నవ్వుకొనెను.

"సుబ్బారావుకు నష్టము పంచకుండుట తెలివి తక్కువ. విశేషించి కూఁతురి పెండ్లిమాట కనుఁగొనకుండ ముందుగానే ఈ పనిచేసి కూరుచుండుట శుద్ధ తెలివితక్కువ. వ్యాపారస్థుఁడును, అందులోపెండ్లిచేయవలసినవాఁడును ఈపని చేయుటయా?" అని మాణిక్యము కాదారము తెచ్చుకొని మగనితో చెప్పఁదలఁచుకొనెను గాని యాలోచించి యాలోచించి "చూడమ్మ పెండ్లియంతయు ఇందులోఇమిడి యున్న"దని తెలిసికొని కాదారమును తిప్పుకొనెను.

'ఒకపెద్ద మొత్తమునకు దావాపడుటకు సిద్ధముగానున్న'దని వచ్చిన తంతిని చూచి రామస్వామి వెంటనే యింటికి బయలుదేఱిపోయెను. కుటుంబముతో వెళ్లుట కతనికింకను వీలు చిక్కలేదు. చెన్నపట్టణములోని ఆఫీసును సిబ్బందిని ఎత్తివేయవలయును. సుబ్బారావు ఋణశేషమునకు ఇల్లు, వాకిలి, అంతయును అమ్మవలయును. మింజుమలె సుబ్బారావే కట్టుకొనఁగలఁడని అతని అభిప్రాయము.

సుబ్బారావు కాలేజికి పోఁదొడఁగెను. సంతోషబలమున నతఁడు రెండు మూడు రోజులలో ఊరిపోయెను. పరీక్షలు సమీపించుచుండుటచే నతఁడు నిర్విచారముగా విద్యావ్యాసంగము చేయఁదొడఁగెను.

చూడమ్మ చిక్కెను. ఆమె కపోలములు పాలతో తుడువఁబడినటు లాయెను. శరద్రాత్రియందలి వేకుజామున పండఁబాఱిన వెన్నెలడా లొకటి యామె శరీరమునుండి వెలువడెను. విషయములలో రసమును, భూతములలో భూమియు నామె నెక్కువగా నాకర్షించెను. క్రమక్రమముగా గమనమునందు మాంద్యము హెచ్చెను. సుబ్బారావును చూడఁగనే యామె కెన్నఁడును లేని సిగ్గు పుట్టుకొని వచ్చెను. ఱుఱునిముసముననే తగ్గి యామె యతని నదేపనిగా చూడదొరకొనెను. ఇటువంటి కూఁతురిని జూచి మాణిక్యము మిగుల భయపడెను.

సుబ్బారా వొకనాఁడు చూడమ్మను జూచి యిటులనెను – 'పరీక్షలు పరుగులెత్తుకొని వచ్చుచున్నవి. నా కిచట చదువుసాగదు. దీనికి నీవే సాక్షివి. వేఱొకచోట గదియొకటి అద్దెకుఁ దీసికొనవలయునని యున్నది.'

చదువు సాగనిమాట నిక్కమే. వేఱొకచోటికి వెళ్లినచో తనకు తన తలిదండ్రుల ముందు చులకఁదనమెక్కుడగుటయు నిక్కమే. ఇపు డీచులకఁదనమును భరించుటకంటె పరీక్షలో అతని అపజయమును భరించుట చాలఁ గష్టము. కావున చూడమ్మ నట్టునట్టుగా ఈక్రింది నియమములతో అంగీకరించెను. '1. గది దాపుగా ఉండవలయును – ఇంచుమించు కనఁబడుచుండునటులు, 2. ఆహారమును ఉపాహారమును తన చేతినుండియే గ్రహింపవలయును, 3. నిద్రకు ప్రొద్దుపోఁగొట్టుకొనకుండ కంజాయింపుగా చదువుకొనవలయును.'

సుబ్బారావీ నియమములకు కడు సులువుగా లోఁబడిపోయెను. అంతదవ్వును అంతదాపును కాని మేడ యొకటితీసికొనెను.

మాణిక్య మిందుల కంగీకరింపఁజాలకపోయెను. గాని చూడమ్మ నచ్చఁజెప్పుటచే ఒకటిరెన్నాళ్లలో సమ్మతించెను. మంచిరోజు చూచి సుబ్బారావు నూతన గృహప్రవేశ మొనరించెను.

అతఁడు పది పదియేనురోజులలోనే చూడమ్మ నియమావళి నుల్లంఘించెను. అతఁడు రాత్రి రెండుగంటలవఱకును కంటిలో పుస్తకము పెట్టుకొని కూరుచుండెను. పూఁట కూళ్లయింటినుండి అన్నపానములు రావించుకొనఁ దొడఁగెను.

చూడమ్మ మిగుల ప్రయత్నించి వంటలక్కచేత తానే అన్నపానము లంపఁగలిగెను గాని నిదురకు ప్రొద్దుపోకుండ చేయఁజాలకపోయెను. ఈ నియమమునుమాత్ర మతఁ డుల్లంఘించు టామె కుల్లాసజనకమే యాయెను.

మాణిక్య మిందులకు లోలోలపనే కంకుకొనెను. గాని యిసుమంతయు పొక్కలేదు. ఋణములు, నష్టములు, కష్టములు, వంశగౌరవము లోనగువాని బాధలన్నిఁటిని ఆమె లోలోలపనే యనుభవించుట చక్కగా నేర్చుకొనెను.

(ఘ)

'సత్యసంధుఁడు సత్యసంధుఁ'డని లోకులేకాక ఋణదాతలుగూడ రామస్వామిని కొనియాడిరి. 'ధర్మరాజు' అనికొంద అతనికి బిరుదిచ్చిరి. 'కలియుగ జాజలి' యని కొందఱు కీర్తించిరి.

చెన్నపురినుండి వచ్చిన సుబ్బారావు రామస్వామి ప్రస్తావించినంతమాత్రముననే చెన్నపట్టణములోని మేడలు మిద్దెలేకాక యిచటి మేడలను మిద్దెలను తన ఋణముక్రింద కట్టుకొని ఊరివెలుపట తన కున్న యొకచిన్న పూరింటిని రామస్వామికి దానము చేసెను.

ఈ రీతిగా అప్పులలో మునిఁగిన రామస్వామికి జుట్టుమాత్రము కనఁబడెను.

లోకమునం దెపుడును రెండు పక్షము లుండక పోవు కావున "మేడలను మిద్దెలను మరలను మాయచేసి లోకులకుకట్టి, ఒకటికాదు, రెండు కాదు, పదిలక్షల డబ్బు కూఁతురిపేర దాఁచుకున్నాఁడు. నష్టమంతా తానే పంచుకున్నాఁడని ఘోషేకాని రేపు కూఁతురి ద్వారా లాభమంతా గుంజుకుంటాఁడు" అని కొందఱు అనకమానలేదు.

రామస్వామి రెండుపక్షములకును తలయొగ్గి సుబ్బారావు తన కొసంగిన ఇంటియందు కాఁపురము పెట్టెను. కొలఁదికాలములో కూఁతురిని భార్యను తీసికొన రాఁదలఁచెను.

సుబ్బారావు పరీక్షలో గెలుపొందుట ముందుచూచినది చూడమ్మ. ఆమె తానే ప్యాసయినటులు సంతసించెను. మాణిక్య మంతకంటే.

చూడమ్మ వెంటనే సుబ్బారావునకును, రామస్వామికిని తంతియిచ్చెను. దానికి ప్రతిఫలముగా వారి సంతోషమును ఆమె తంతివలననే యందుకొనెను.

కన్యలుకలవారు పలువురతని పరీక్షలో విజయముకొఱకు కాచుకొని కూరుచుండిరి. అతనికి తల్లిలేదు. తండ్రిలేఁడు. పైవారెవరును లేరు. అతఁడు బంగారు పిచ్చుక. పైఁగా పట్టభద్రుఁడు. ఎవరతనికి పిల్లనిచ్చుట కుఱుకరు? ఎవతె యతనిని చేసికొనవలయునని యుబలాటపడదు?

అతనియింటిలో కన్యకల సంత యేర్పాటుచేయఁబడినటు లయిపోయెను. పల్లెలనుండి బస్తీల నుండి తండ్రులతో అన్నలతో తమ్ములతో కన్యలు వచ్చిపడుచుండిరి. 'సుబ్బారావుకు పెండ్లికూఁతురు ఇదివఱకే స్థిరపడిపోయింది. కట్నంకూడా ముట్టింది' అను ప్రవాదమును కన్యాదాతలందఱును వినుచుండిరిగాని వారి ప్రయత్నములను మాత్రము వారు మానలేదు.

పలనాటినుండి చెంచయ్య యను లక్షాధికారి పెండ్లికావలసిన తనకూఁతురిని, పెద్దకూఁతురిని, పెద్దకొడుకును తీసికొని సుబ్బారావు సంతకు వచ్చెను. కన్య చెంచయ్య వెనుకను, పెద్దకూఁతురు పెద్దకొడుకులు ముందును నిలువఁబడియుండిరి. కన్యకు పంద్రెండేండ్లు ఉండవచ్చును. పెద్దకూఁతురికి ఇరువది. ఆమె భర్త చిన్ననాఁడే పోయెను. దానివలన ఆమె శరీరమున బంగారుదినుసు రెట్టిగా నుండెను. శరీరముగూడ హృష్టపుష్టముగా నుండెను. పెద్దకొడుకు పదునెనిమిదేండ్ల వాఁడు. అతనికి మెదడు తిన్నగా పెరుఁగలేదు. దాని లోటును శరీరము భర్తీచేసికొనెను.

చెంచయ్య ఇటులనెను – 'వీఁడు మాపెద్దోఁడు. చదువుసంధ్యలు తక్కువ. కాకున్నా మా పల్లెటూళ్లల్లో మీ చదువులు దిగుమతి కావుగదాండి! ఇది నా పెద్దపిల్ల; తలచెడింది. ఇదండి నాసంసారపు ముచ్చట.

'నా కాతా అంతా కట్నం పెటతాను. నడవళ్లన్నీ నడుపుతాను. ఇంకా తమకోరికలు తెలపండి' అని నాణెమును చూచుకొనఁగలందులకు తన వెనుక దాఁగియున్నను పట్టపగటిని నట్టనడిరేయినిగాఁ జేసివయిచుచున్న తన కూఁతురిని మెల్లగాచేఁపను లాగి నటులు ముందరికి లాగెను.

విధవపిల్ల తన యింట వంటలక్క యగుననియు, పెద్దపిల్లఁడు పాలేరుపనిచేయఁ గలఁడనియు సుబ్బారావు గ్రహించెను. ఇది యంతయు ఆర్థికముగా వాటముగనే యున్నదని యతఁడనుకొనెనుగాని కన్య కానిపింపఁగనే అతని సౌందర్యబోధ కవమానము కలిగెను. ఏలయనఁగా చెంచయ్య దేశవాళీమనిషి. స్వస్థాన వేషభాషలలో అతనికి లోభము మెండు.

పెండ్లికూఁతురి శిరస్సుమీఁద సూర్యుఁడును చంద్రుఁడును కలరు (బంగారపునగలు). బ్రహ్మరంధ్రము దిగువ అర్ధచంద్రుఁడు. జడక్రింద భూగోళములవలె జడకుప్పెలు. చెవులకు జూకాలు. ముక్కున అడ్డబాస. ఏఁబది సేర్ల బంగారపుకమ్ములు

ఒడలంతయు ఓతప్రోతము లయియుండెను. ఆ బంగారములోనుండి ఒకానొక నలుపు నిప్పులోనుండి పొగవలె కానిపించుచుండెను.

'చూడమ్మ సౌందర్యాగారమున కీపిల్ల దిష్టిపిడత' అని సుబ్బారావనుకొనెను. ఇటు లనుకొనినను అతని యాకారముగాని, యింగితముగాని యిసుమంతయు తొణకలేదు. 'ఆలోచించి ఉత్తరము వ్రాయింతును' అను మామూలుమాట అతఁడనఁగనే చెంచయ్య పిల్లి కూనవలె వెడలిపోయెను. ఇటులొకరొకరే తమతమ కన్యకలతో తిరిగిపోవుచుండిరి.

ఒకనాఁడు కుంచాల అంకమయ్య కూఁతురి సౌందర్యమును ప్రదర్శించుటకు సాహసించి సుబ్బారావింటికి వెళ్లెను. సుబ్బారా వెదురువచ్చి యెమ్మెల్సీని లోనికిఁ గొంపోయెను. 'అంకమయ్యగారి కూఁతురు అన్ని విధాలా చూడకు చెల్లెలు' అని అతఁ డనుకొనెను.

రెండుమూడు గంటలసేపు వారుమాటలాడుకొనిన మాటల సారాంశము ఇది : 'నాణెము చెలామణీ యాయెను. కాని బేరము తెగలేదు. అదియును తొందరగనే తెగఁ గలదు. ఏలయనఁగా పెండ్లికొమార్తె మాతామహి చాల ధనవతి. ఆమె కెవరునులేరు.

పెండ్లి పరాసురాజ్యమునందుఁగాని, మొగలాయి రాజ్యమునందుఁగాని ఒకరోజు జరుగును. అయిదురోజులింటికద జరుపు పెండ్లికగు వెచ్చములో ఈ యొకరోజు పెండ్లి వెచ్చమును తీసివేయఁగా మిగిలిన ధనము పెండ్లి కొడుకుకు చేతికట్నము. మగపెండ్లివారి వెచ్చ మంతయు ఆఁడుపెండ్లివారే భరింపఁగలరని వేఱుగా తెల్పనక్కఱ యుండదు.'

(జ)

తంతి అందినవెంటనే సుబ్బారావు స్వయముగా వచ్చి పాణిగ్రహణము చేయఁ గలఁడని చూడమ్మ ఆసించెనుగాని దానికి బదులుగా రామస్వామి వచ్చెను. సుబ్బారావు రాకున్నను అతఁడు పరీక్షలో గెలుపొంది నందులకు వారు విందుకావించుకొనిరి.

తనకూఁతురు ఇంటికి పోవుదమని నోరు పొఱవయిచుకొనకముందే రామస్వామి పయనము తూఁగించెను. నిదురలేకయే వారందఱును మూడవతరగతిబండి నుండి దిగిరి. రైలు దిగఁగనే చూడమ్మకును మాణిక్యమునకును ఆశ్చర్యవిషాదము లుదయించెను. ఏలయనఁగా వారి సొంతమోటారు స్టేషనుకు రాలేదు. అది రాకపోయినను సుబ్బారావయినను తనకారు తీసికొనిరాలేదు. మఱియొక విశేష మేమనఁగా రామస్వామి గుఱ్ఱపుబండినయినను కాదు, ఎద్దుబండిని బాడుగకు కట్టించెను. ఇంకొకవిచిత్ర మేమనఁ గా బండి తమయింటిదారిని బోక మఱియొక దారిని బడిపోవుచుండెను.

'బండీ పాంతపేటలోకి పోతూంది, జనములవారి వీధిలోకిపోనీ' అని మాణిక్యమనెను.

బండివాఁడు నొచ్చుకొని యిటులనెను - 'అయ్యగోరు పాంతపేటకు తోలమన్నారుండీ.'

'పాంతపేటలో ఏముంది?'

బండివెనుక తలవంచుకొని నడచి వచ్చుచున్న రామస్వామి యీ తూరి యిటులు సమాధానము చెప్పెను: 'మనయిల్లు సుబ్బారావుకు కట్టి అప్పుతీర్చాను. పాంతపేటలో ఒక యిల్లు అతఁడు మనకు ఉచితంగా ఇచ్చాఁడు.'

మాణిక్యము గుండెలలో రాయిపడెను. ఆమె కన్నులనుండి జలధార లారంభించెను.

బండివాఁడిటులనెను - 'అయ్యోరు దర్మరాజులు కామట్టి దమ్మిడీలతో ఋణాలు తీర్చేశారు. బాపనయ్యగారు దివాలాతీసి రెండులచ్చల ఆస్తిపరులయ్యారు. రత్తంగోరు మటుక్కు రత్తంగోరు ఉన్నవీ లేనివీ కలబోసి పదిలచ్చలికి లెక్కచెప్పి అయిదులచ్చలు అంకాలుగారి యెనకేసుక్కూకుండారు. రాంసాంయిగోరు సత్తెఅరిచ్చందుడి కాలంవోరు కామట్టి సుబ్బారావుగారు వొద్దన్నా లాభాలు ఆయన కిచ్చేసి యీరేసుగోరికి తామిచ్చినమాట నిలఁబెట్టుకున్నారు. దర్మరాజులల్లే అరణ్యవాసం మొదలెట్టి మాబస్తీకల్లా సత్తావతారంగా మాపేటలో వెలిశారు. మాకు మీరే దేవతలు. దుక్కపడకుండమ్మా దుక్కపడకండి. కట్టకాలం.'

ఈమాటలు విని మాణిక్యము కన్నీటిని కొనగోటితో చిమ్మివేసెను. 'చెడ్డ కాఁపురమునకు ముప్పే మిటి?' అని యామె లోలో ననుకొనెను.

కొంతసేపటికి వారిబండి యొక గొందిలో ప్రవేశించెను. దారి కిరువైపులను మేఁకలును, గొఱియలును పరుండియుండెను. చెడిపోయినబండ్లు అటునిటు పడియుండెను. కమ్మర కొలిమిలోని బూడిదె ఎగిరి వచ్చి కన్నులను, ముక్కులను కమ్ముకొనుచుండెను. ఆ ప్రదేశమేనాఁడును మునిసిపాలిటీవారి మొగమెఱుఁగదు.

బండి యాఁగఁగనే రామస్వామి యింటితాళము తెఱచెను. చూడమ్మయును మాణిక్యమును ఆ యింటి లోనికి పోనెఱచినటులు వాకిటనే కొంతసేపు నిలిచిరి. బండివాఁడు సామాను లోపలఁ బెట్టినపిదప తలవంచుకొని తల్లిబిడ్డలిరువురును గృహప్రవేశమయిరి.

బండివాఁడు బాడుగ అడుగకుండఁగనే వెళ్లిపోవుచుండెను. రామస్వామి వెలుపలికి వచ్చివానిని పిలిచెను. పిలుపు వినఁబడఁగనే యతఁడు మఱింతవడిగా బండితోలుకొని

అదృశ్యుఁడయిపోయెన. అనంత మగు ఆ శూన్యమునందు నిలువఁబడిన రామస్వామి కనులనుండి బాష్పములును, కంఠమునుండి యొకానొక ధ్వనియును వెలువడి వెంటనే నిరుద్ధమాయెను.

సూర్యచంద్రు లిరువురును కట్టివేయఁబడిన ఆ యింటిలో నెన్నఁడును ఎండకన్నెఱుఁగని ఆతల్లిబిడ్డ లెటులు ప్రొద్దుగ్రుంకించిరో వారికే తెలియవలయును. పగలంతయు సూర్యునిచే పరిశోధింపఁబడిన ఆ యిల్లంతయు నిపుడు చంద్రుని పరమాయెను.

ఈ పరిణామ మంతయు చూడమ్మను కదలించఁ జాలియుండలేదు. సుబ్బారావును చూడఁబోవ తలిదండ్రులయనుమతి నడుగుట ఆమెకు కొంచెము లేఁత గాఁ దోఁచినను అది విధి యాయెను. ఆమె కోరుటయే తడవుగా వారియంగీకారమును బడయఁగలిగెను. క్రొత్తగా వెల్లవేయఁబడిన రెండుమేడలా వెన్నెలలో తళతళలాడుచు ఆమెమీఁద గాంభీర్యమును ప్రకటించెను. మాటాడకుండ మేడ యెక్కుచు చూడమ్మ నిండుగంగవలె కలకలలాడెను.

చంద్రుఁడుదయించెను. నిండుఁబున్నమ. పండువెన్నెల తలిదండ్రుల యాశీర్వాదము. కోరుకొనిన కొమరుఁబ్రాయమువాఁడు. గంధర్వకన్యవలె చూడమ్మ మేడయెక్కెను.

సుబ్బారావు వెలవెలపోయి గాంభీర్యము తెచ్చుకొని చేతులు జాఁపుచు ఎదురువచ్చెను.

'అక్కడనే అక్కడనే' అని చూడమ్మ తర్జనితో చూపెను. జంకి సుబ్బారావచటనే నిలువఁబడెను.

'మన పెండ్లికి సుముహూర్త మెపుడు?' అని చూడమ్మ అనెను.

'ఇంకా నీకు పెళ్లేమిటి, బారసాల చేయాలి గాని' అని సుబ్బారావనెను.

'తమరు ఏమిచేయింపఁదలఁచికొనినను చేయింపఁగలరు. కాని లోఁగడ మీరు ఇచ్చినమాటను చెల్లింపఁగోరెదను' అని చూడమ్మ యనెను.

సుబ్బారావు శుభలేక యొకటితీసి చూడమ్మ చేతిలోఁ బెట్టి యిటులనెను – "నేనే వచ్చి మిమ్మల్ని పిలవాలని అనుకుంటుండంగా నీవే వచ్చావు. అదల్లా ఉండనీ,

అందఱూ మీనాయన లవుతారా? దానికేం గాని పెండ్లిమాటలే రాకమునుపు నీవు నాతో చీకటి తప్పుచేశావు. ఇఁక ముందు ఇంకోళ్లతో ఁగూడా చేస్తావంటానికి ఇదే పరప్రమాణం ఇటువంటి నీకు పెళ్లేమిటి?

• *భారతి - ఆగష్టు / నవంబర్ - **1934*** •